తెలుగు దినపత్రిక
https://aksharagalam.com
# అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం

పేజీలు: 8 | వాల్: 3 | సంపుటి:3 | సంచిక: 142

గురువారం అక్టోబర్ 23, 2025

॥ ఎడిటర్: దయాకర్ రెడ్డి ॥



శబరిమల అయ్యప్పస్వామి ఆలయంలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము స్వామివారికి పూజలు నిర్వహించారు. నలుపు చీరతో భక్తి శ్రద్ధలతో ఇరుముడి కట్టుకువచ్చిన ముర్ము, వాటిని ఆలయంలో స్వామివారికి అందించారు. మహిళలకు శబరిమల ఆలయ ప్రవేశంపై వివాదం ఉన్న నేపథ్యంలో.. రాష్ట్రపతి ముర్ము ఆలయానికి సందర్శించడం ద్వారా మహిళలకు మార్గదర్శిగా నిలిచారు.

# రెండేళ్లలో ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం పూర్తి

- ఆధునిక పద్ధతుల్లో అవసరాల మేరకు నిర్మాణాలు
- ఆస్పత్రికి అసవరమైన వైద్య పరికరాలు సిద్ధం చేయాలి
- ప్రజలకు ఇబ్బంది లేకుండా సమన్వయంతో ముందుకు సాగాలి
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ స్పష్టమైన ఆదేశాలు



హైదరాబాద్,అక్టోబర్22(అక్షరగళం): గోషామహల్ వద్ద చేపట్టిన ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం రెండేళ్లలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉస్మానియా నూతన ఆసుపత్రి భవన నిర్మాణ పనుల పురోగతిపై సీఎం సమీక్షించారు.

మిగతా.. 2లో



## తెలంగాణ రవాణా చెక్‌పోస్టుల ఎత్తివేత

- సిఎం ఆదేశాలతో తక్షణ చర్యలు
- ఆగమేఘాలమీద రవాణా శాఖ నిర్ణయం
- నంబర్ ప్లేట్ రికగ్నేషన్ అమలు

హైదరాబాద్,అక్టోబర్22(అక్షరగళం): తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రహదారులపై ఉన్న రవాణా చెక్ పోస్టులను వెంటనే ఎత్తివేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సంచలన ఆదేశాలిచ్చారు. దీంతో తక్షణమే ఈ నిర్ణయాన్ని అమలు చేస్తున్నట్లు రవాణా శాఖ ఉత్తర్వులు

మిగతా.. 2లో



## నేడు తెలంగాణ కేబినేట్ భేటీ

- బీసీ రిజర్వేషన్లు.. స్థానిక ఎన్నికలపై చర్చ
- కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం

హైదరాబాద్,అక్టోబర్22 (అక్షరగళం): తెలంగాణ మంత్రి వర్గంసీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాయలంలో సమావేశం కానుంది. మధ్యాహ్నం 2 గంటలకు సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. ఈ కేబినెట్ సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలతో

మిగతా.. 2లో

# సందిగ్ధంలో నవీన్ నామినేషన్


- బీఆర్‌ఎస్ అభ్యంతరంతో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ నామినేషన్ పెండంగ్
- హైడ్రామా తర్వాత నవీన్ నామినేషన్ ఓకే
- సునీత 'నా తండ్రి భార్య ' కాదంటూ గోపీనాథ్ తనయుడి ఫిర్యాదు
- వారిది లివింగ్‌టు గెదర్ అని ఈసీకి తారక్ ప్రద్యుమ్న ఫిర్యాదు
- గోపీనాథ్ తన తల్లికి విడాకులివ్వలేదని మాగంటి కొడుకు తారక్ స్పష్టీకరణ
- అయినా బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీత నామినేషన్ ఓకే
- జూబ్లిహిల్స్ ఉప ఎన్నిక నామినేషన్ల పర్వంలో హైడ్రామా




హైదరాబాద్,అక్టోబర్22(అక్షరగళం): జూబ్లీహిల్స్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్ భార్య కాదంటూ ఆయన మొదటి భార్య కుమారుడు తారక్ ప్రద్యుమ్న ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాడు. బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీత నామినేషన్‌ను రద్దు చేయాలని మాగంటి గోపీనాథ్ మొదటి భార్య తనయుడు ప్రద్యుమ్న ఈసీకి ఫిర్యాదు చేశాడు. గోపీనాథ్ భార్య మాలిని అని.. సునీత కాదని ఆరోపించారు. మాలినితో గోపీనాథ్‌కు విడాకులు అవ్వలేదని ప్రద్యుమ్న ఫిర్యాదు చేశాడు.విడాకులు అవకుండానే గత ఎన్నికల సమయంలోనూ గోపీనాథ్ తన అఫిడవిట్‌లో భార్య స్థానంలో సునీత పేరును పేర్కొన్నట్లు ఆరోపించారు.

ఈ వివాదం ఇలా కొనసాగుతుండగానే.. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ నామినేషన్‌పై బీఆర్‌ఎస్ అభ్యర్థి అభ్యంతరం వ్యక్తం చేశారు. నిర్దేశిత కాలమ్స్‌లో వివరాలు నింపకుండా తప్పులు ఉన్నా యని అభ్యంతరం వ్యక్తం చేశారు. కాగా, బీఆర్‌ఎస్ ఫిర్యాదుతో నవీన్ యాదవ్ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి పరిశీలిస్తున్నారు.

మిగతా.. 2లో



## అంతుచిక్కని ప్యారీస్ మ్యూజియం చోరీ

- రూ.895 కోట్లు విలువైన పురాతన వస్తువులు మాయం

ప్యారిస్,అక్టోబర్22(అక్షరగళం): ఫ్రాన్స్‌లో ప్రఖ్యాత లౌవ్రే మ్యూజియంలో చోరీ ఘటన యావత్ ప్రపంచాన్ని షాక్‌కు గురిచేసింది. అత్యంత భద్రత కలిగిన ఈ మ్యూజియంలోకి చొరబడిన దుండగులు కేవలం నిమిషాల వ్యవధిలో విలువైన ఆభరణాలు దొంగలించి పరారయ్యారు. చోరీ అయిన నగల విలువ దాదాపు రూ. 895

మిగతా.. 2లో




## రూపాయి బలోపేతానికి ఆర్‌బీఐ చర్యలు

న్యూఢిల్లీ, అక్టోబర్22(అక్షరగళం): అమెరికా కఠిన నిర్ణయాలు, అంతర్జాతీయ పరిణామాల నేప థ్యంలో తీవ్ర ఒత్తిడికి గురవుతున్న భారత రూపాయికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాఅండగా నిలిచింది. డాల ర్‌తో పోలిస్తే రూపాయి విలువ మరింత దిగజారకుండా నిరోధించేందుకు భారీ ఎత్తున చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆగస్టు నెలలో ఏకంగా 7.69 బిలియన్ అమెరికన్ డాలర్లను (సుమారుగా రూ. 67 వేల కోట్లు) మార్కెట్లో విక్రయించినట్లు ఆర్బీఐ తన తాజా బులెటిన్‌లో వెల్లడించింది.



# 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్'గా తెలంగాణ

- లైఫ్ సైన్సెస్ రంగంలో మరో ముందడుగు
- నూతన ఆవిష్కరణలకు ఊతమిచ్చే వ్యూహాత్మక భాగస్వామ్యం
- ఆస్ట్రేలియా యూనివర్సిటీ 'ఆర్‌ఎంఐటీ'తో రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌వోఐ
- ఇన్నోవేషన్, ఆర్‌అండ్ డీ, నైపుణ్యాభివృద్ధిలో ద్వైపాక్షిక సహాకారం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి

హైదరాబాద్,అక్టోబర్22(అక్షరగళం): అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్' గా మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా బుధవారం మెల్‌బోర్న్‌లోని ప్రముఖ యూనివర్సిటీ 'ఆర్‌ఎంఐటీ'తో రాష్ట్ర ప్రభుత్వం లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్ వోఐ)ను కుదుర్చుకుందని చెప్పారు.

లైఫ్ సైన్సెస్ రంగంలో ఇన్నోవేషన్, పరిశోధన, అభివృద్ధి, ఉన్నత విద్య, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రెడీ టూ వర్క్ ఫోర్స్ తయారీ తదితర అంశాల్లో ద్వైపాక్షిక సహకారానికి ఈ ఒప్పందం దోహదపడుతుందన్నారు. రేపటి జీనోమ్ వ్యాలీకి ఇది ఒక బ్లూ ప్రింట్‌గా మార్గ నిర్దేశం చేస్తుందన్నారు. ఆసియా లోనే అగ్రగామిగా ఎదిగిన తెలంగాణ "లైఫ్ సైన్సెస్" ఆర్థిక వ్యవస్థను 2030 నాటికి 250 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

80 బిలియన్ డాలర్ల విలువ చేసే 2వేలకు పైగా జాతీయ, అంతర్జాతీయ దిగ్గజ ఫార్మా, బయోటెక్ కంపెనీలు ఇక్కడ ప్రస్తుతం కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. దేశంలో ఉత్పత్తయ్యే

మిగతా.. 2లో

## కోదండరామ్ మద్దతు కోరిన పిసిసి చీఫ్

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక
- దానం బహిరంగంగానే కాంగ్రెస్‌కు మద్దతు

హైదరాబాద్,అక్టోబర్22(అక్షరగళం): జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నిక నేపథ్యంలో రాజకీయ చర్చలు వేడెక్కాయి. ఈ క్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బుధవారం తెలంగాణ జన సమితి (టీజేఎస్) కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండ రామ్‌ను కలిశారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు ఇవ్వాలన్న

మిగతా.. 2లో





## రాజన్న దర్శనాలను నిలిపేసిన అధికారులు

వేములవాడ,అక్టోబర్22(అక్షరగళం): కార్తీక మాసం కావడంతో వేములవాడ రాజన్నకు భక్తుల తాడికి విపరీతంగా పెరిగింది. అయితే ఉదయం నుంచి స్వామివారికి మొక్కులు చెల్లించుకునే క్రమంలో తలనీలాలు సమర్పించుకొని దర్శనానికి రాగా బంద్ చేసినట్లుగా భద్రతా సిబ్బంది వెల్లడించడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని చాలా ప్రాంతాల నుంచి వచ్చామని భక్తులు వెల్లడించారు.

మిగతా.. 2లో




## బకాయిలు అడిగితే బ్లాక్‌మెయిల్ చేసినట్టా..?

దౌర్భాగ్యస్థితి కాంగ్రెస్ సర్కారు : బండిసంజయ్ ఫైర్

హైదరాబాద్, అక్టోబర్22(అక్షరగళం): పెండింగ్ బకాయిలు అడిగితే బ్లాక్ మెయిల్‌లాగా సీఎం రేవంత్‌రెడ్డి ఫీల్ అవుతున్నారని, కనీసం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇతరత్రా పెండింగ్ బిల్లులు చెల్లించలేని స్థితిలో కాంగ్రెస్ సర్కారు ఉన్నదని కేంద్రమంత్రి బండిసంజయ్ ఫైర్ అయ్యారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్య శ్రీ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలరాస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. బకాయిలు చెల్లించాల్సిందే అంటూ పట్టుబడిన బండి సంజయ్.. ప్రభుత్వానికి పలు అంశాలపై ప్రశ్నల వర్షం

మిగతా.. 2లో




## రవాణాశాఖలో ఎఐ సాంకేతికత అమలు

- షో రూముల్లోనే వాహన రిజిస్ట్రేషన్ల పరిశీలన
- ఢిల్లీ కాలుష్యం దృష్ట్యా హైదరాబాద్‌పై ప్రత్యేక దృష్టి
- అధికారులతో సమీక్షించిన మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్,అక్టోబర్22(అక్షరగళం): దిల్లీలో కాలుష్యం ఎలా ఉందో అందరం చూస్తూనే ఉన్నామని.. అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో రాకుండా ప్రణాళికలు చేపట్టినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

రవాణాశాఖ కార్యాలయాల్లో మధ్యవర్తులు లేకుండా చేస్తాం. ఈ శాఖలో ఏఐ

మిగతా.. 2లో

# రవాణాశాఖలో ఏఐ సాంకేతికత అమలు

(మొదటి పేజీ తరువాయి)

వినియోగాన్ని మరింత పెంచాలని నిర్ణయించాం. ఎలక్ట్రిక్ వాహనాలపై రూ.577 కోట్ల పన్ను మినహాయింపు ఇచ్చాం. దీంతో ఆ వాహనాల విక్రయాలు 0.03 శాతం నుంచి 1.30 శాతానికి పెరిగాయి. వాహన సారథి పోర్టల్‌ను పూర్తిగా అందుబాటులోకి తెచ్చాం. రాష్ట్రంలో వాహనాల సంఖ్య 1.70 కోట్లకు చేరింది. షోరూమ్‌లోనే వాహనాల రిజిస్ట్రేషన్ చేసే అంశంపై ఆలోచన చేస్తున్నాం. ప్రజలు సహకరిస్తేనే.. ట్రాఫిక్ కష్టాలు, కాలుష్యం తగ్గుతుందని మంత్రి పొన్నం అన్నారు. ఇకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ట్రాన్స్‌పోర్ట్ చెక్‌పోస్టులను తక్షణమే మూసివేస్తున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఆర్టీఏ చెక్ పోస్టుల రద్దు చాలా పెద్ద నిర్ణయమని పేర్కొన్నారు. చెక్ పోస్టుల విషయంలో మరింత పారదర్శకత తీసుకొస్తామని.. ఇందులో భాగంగానే ప్రస్తుతమున్న ఆర్టీఏ చెక్ పోస్టులను రద్దు చేసినట్లు తెలిపారు. ప్రతి ఆర్టీఏ కార్యాలయంలో సిమ్యులేటర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. రవాణా వ్యవస్థలో ఏఐ సేవలు మరింత వినియోగిస్తామని స్పష్టం చేశారు. బుధవారం రవాణా శాఖపై సంబంధిత అధికారులతో మంత్రి పొన్నం సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం ఏ విధంగా ఉందో అందరం చూస్తున్నామని.. అలాంటి పరిస్థితి హైదరాబాద్‌కు రావొద్దని అన్నారు. ప్రజలు సహకరిస్తేనే ట్రాఫిక్ కష్టాలు, కాలుష్యం తగ్గుతుందన్నారు. రోడ్డు భద్రతపై విద్యార్థులు, ప్రజలు, వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామని.. రూల్స్ అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. వాయు కాలుష్యాన్ని తగ్గించాలనే లక్ష్యంలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలకు రాయితీలు ఇస్తున్నామని.. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. వాహనాల స్క్రాపింగ్ విషయంలో కొత్త పాలసీ తీసుకొస్తున్నామని చెప్పారు. వాహనాల స్క్రాపింగ్‌ను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు యోచిస్తున్నామన్నారు.

# కోదండరామ్ మద్దతు కోరిన పిసిసి చీఫ్

(మొదటి పేజీ తరువాయి)

అంశంపై ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. కోదండరామ్‌తో జరిగిన సమావేశం అనంతరం టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఆవిర్భావంలో కోదండరామ్ పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. ఆయన నిస్వార్థంగా, నిజాయితీతో రాష్ట్ర సాధన కోసం కృషి చేశారని గుర్తుచేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఎలా నిరంకుశంగా మారిందో అందరికీ తెలుసని మహేష్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఆ పాలన నుంచి విముక్తి కోసం కాంగ్రెస్, టీజేఎస్ సహా ప్రజాసంఘాలన్నీ కలిసి 2023

ఎన్నికల్లో పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంలో టీజేఎస్ సహకారం ఎంతో విలువైనది. దాన్ని మేము ఎప్పటికీ మరవం,' అని తెలిపారు. ఉద్యోగ నియామక రూపకల్పనలో కోదండరామ్ సలహాలు, సూచనలు ఎంతో విలువైనవని మహేష్ గౌడ్ అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా పాలన కొనసాగుతుందని హామీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో యువ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని టీజేఎస్‌ను కోరారు. సీపీఐ, సీపీఎం, ఏఐఎంఐఎం మాదిరిగా టీజేఏసీ మద్దతు కూడా కోరినట్లు తెలిపారు. ఇక బీజేపీ నేతలపై తీవ్రంగా విరుచుకుపడ్డ ఆయన? 'కేంద్రమంత్రి స్థాయిలో ఉన్న బండి సంజయ్ ఏమి మాట్లాడుతున్నారో తనకే అర్థమవుతున్నదా? మత విద్వేషాలు రెచ్చగొట్టి, సెంటిమెంట్లు రాజేసి లబ్ది పొందాలన్నదే బీజేపీ పన్నాగం,' అని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మతవాద శక్తులకు బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందని వ్యాఖ్యానించారు. మిత్రపక్షాలతో ఇచ్చిన మాటను కాంగ్రెస్ నిలబెట్టుకుంటుందని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన కొనసాగుతుందని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు.

**దానం బహిరంగంగానే కాంగ్రెస్‌కు మద్దతు: మహేష్ కుమార్ గౌడ్**

తెలంగాణ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. దానం నాగేందర్ బహిరంగంగానే కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నారని చెప్పుకొచ్చారు. ఇదే

సమయంలో కొండా సురేఖ, కొండా సుస్మిత వివాదం ముగిసిపోయిందని క్లారిటీ ఇచ్చారు. టీపీసీసీ ఛీఫ్ మహేష్ కుమార్ తాజాగా మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో మా స్టార్ క్యాంపెయినర్ లిస్టులో దానం నాగేందర్ పేరు ఉంటే తప్పేంటి?. ముసుగులో గుద్దులాటలు అవసరం లేదు.. దానం నాగేందర్ సపోర్ట్ డైరెక్ట్ చేస్తున్నాడు. మా పార్టీకి మద్దతు ఇస్తే తప్పేంటి?. ఫిరాయింపుల అంశాన్ని స్పీకర్ చూసుకుంటారు.

జీవన్ రెడ్డి చాలా రోజుల నుంచి అసంతృప్తితో ఉన్నారు. జీవన్ రెడ్డితో త్వరలోనే మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. కొండా సుస్మిత వ్యాఖ్యలపై కొండా దంపతులు విచారం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మళ్ళీ ఇలాంటివి జరగవని కొండా దంపతులు ముఖ్యమంత్రితో చెప్పారు. కొండా సురేఖ వివాదం ముగిసింది. రెండు మూడు రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నేను ఢిల్లీ వెళ్తాం. డీసీసీల ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తాం' అని చెప్పుకొచ్చారు.

# 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్'గా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

ఔషధాల్లో మన వాటా 40 శాతంగా ఉందన్నారు. ప్రపంచానికి అవసరమైన వ్యాక్సిన్లలో మూడింట ఒక వంతును మనమే అందిస్తున్నామన్నారు. 'ఎలీ లిల్లీ' లాంటి దిగ్గజ ఫార్మా సంస్థలు తెలంగాణ వైపు చూస్తున్నాయని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా తెలంగాణ యువతను లైఫ్ సైన్సెస్ రంగానికి అవసరమైన అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులుగా తీర్చే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందన్నారు. త్వరలోనే ప్రత్యేకంగా తెలంగాణ లైఫ్ సైన్సెస్ స్కూల్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తాజా ఒప్పందంలో భాగంగా ఉమ్మడి పీహెచ్‌డీ, స్టూడెంట్, ఫ్యాకల్టీ ఎక్స్చేంజ్ ప్రోగ్రాం అందుబాటులోకి వస్తుందన్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేలా ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టులను చేపడతామన్నారు.

పరిశోధక విద్యార్థులు బిట్స్ హైదరాబాద్, ఆర్ఎంఐటీ యూనివర్సిటీలలో నిపుణుల మార్గ నిర్దేశంలో రీసెర్చ్ చేసే అవకాశం లభిస్తుందన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఉమ్మడి అకడమిక్ కరిక్యులంను రూపొందించి విద్యార్థులను రేపటి అవసరాలకు అనుగుణంగా స్కిల్డ్ వర్క్ ఫోర్స్ గా తయారు చేస్తామన్నారు.

కార్యక్రమంలో భాగంగా మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ సీఈఓ శక్తి నాగప్పన్, ఆర్ఎంఐటీ యూనివర్సిటీ డిప్యూటీ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కేథరీన్ ఇట్సియోపౌలోస్ లెటర్ ఆఫ్ ఇంటెంట్ పై సంతకాలు చేశారు. తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాలతో కలిసి పనిచేసే అవకాశం దక్కడం సంతోషంగా ఉందని ప్రొఫెసర్ కేథరీన్ ఇట్సియోపౌలోస్ అన్నారు.

# అమెజాన్‌లో భారీగా ఉద్యోగాల కోత

**రోబోలతో పనిచేసేలా ప్లానింగ్**

**వాషింగ్టన్,అక్టోబర్22(అక్షరగళం):** 2033నాటికి అమెజాన్ ఐదులక్షల మంది ఉద్యోగులను రోబోలతో భర్తీ చేయనుంది. అంతర్గత పత్రాలు, సమీక్షించిన ఇంటర్వ్యూలను ఉదహరిస్తూ జాతీయ మీడియా మంగళవారం ఈ అంశంపై ఒక నివేదికను ప్రచురించింది. 2027 నాటికి యాంత్రీకరణ 1,60,000 అదనపు ఉద్యోగాలను నివారించగలదని సంస్థ విశ్వసిస్తోందని పేర్కొంది. దీంతో అమెజాన్ ఉద్యోగుల నియామకాల వేగాన్ని తగ్గించనుందని నివేదిక తెలిపింది. అమెజాన్ రోబోటిక్స్ బృందం కంపెనీ మొత్తం కార్యకలాపాల్లో 75శాతం యాంత్రీకరణను పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. ఈ చర్య ఇప్పటి నుండి 2027 వరకు సంస్థ 12.6 బిలియన్ డాలర్లు ఆదా చేసేందుకు అనుమతిస్తుంది.

# బకాయిలు అడిగితే బ్లాక్‌మెయిల్ చేసినట్టా..?

(మొదటి పేజీ తరువాయి)

కురిపించారు. బకాయిలు అడిగితే విజిలెన్స్ దాడులతో బ్లాక్ మెయిల్ చేస్తారా? విద్యార్థులు, యాజమాన్యాల భవిష్యత్తుతో చెలగాటమాడతారా? బ్లాక్ మెయిల్ చేస్తే చూస్తూ ఊరుకుంటామా? కమీషన్లు రావనే సాకుతో బకాయిలు చెల్లించడం లేదా? అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీని కూడా కాలరాస్తారా? పదేపదే ఇచ్చిన మాటను తప్పే వాళ్లను ఏమనాలి? బీహార్ ఎన్నికలకు పైసలు ఇక్కడి నుండే పంపుతున్నారు కదా? విద్యార్థుల భవిష్యత్తు కోసం బకాయిలు చెల్లించలేరా? ఈసారి తక్షణమే బకాయిలు మొత్తం చెల్లించాల్సిందే.. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవు' అంటూ హెచ్చరించారు. విద్యార్థులు, యాజమాన్యాలతో కలిసి మంత్రులను రోడ్లపై తిరగనీయమని వార్నింగ్ ఇచ్చారు. యాజమాన్యాలూ..... ప్రభుత్వానికి భయపడి సమ్మె విరమిస్తే అంతే సంగతులు.. భవిష్యత్తులో ఎవరూ అండగా నిలబడే పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. ఆరోగ్యశ్రీ బకాయిలపైనా రోడ్డెక్కడం తథ్యమని వెల్లడించారు. మంత్రులు ప్రతి పనికి కమీషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆ సొమ్మును కాంగ్రెస్ హైకమాండ్‌కు కప్పం కడుతున్నారంటూ బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాగా.. ఈరోజు ఉదయం హైదరాబాద్‌లోని నల్లకుంట శంకరమఠ్‌కు చేరుకున్న బండి సంజయ్.. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శృంగేరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విదుశేఖర భారతి స్వామి ఆశీస్సులను కేంద్రమంత్రి అందుకున్నారు.

# తెలంగాణ రవాణా చెక్‌పోస్టుల ఎత్తివేత

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేసింది. సాయంత్రం 5 గంటల్లోగా మూసివేతపై పూర్తి నివేదికను ఇవ్వాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. సీఎం రేవంత్ ఆదేశాలతో తక్షణమే చెక్‌పోస్టుల కార్యకలాపాలు నిలిపివేయాలని ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ ఆకస్మిక, తక్షణ ఆదేశాలు జారీ చేశారు. చెక్ పోస్టుల వద్ద ఉన్న సిబ్బందిని వెంటనే వేరే బాధ్యతల్లో వినియోగించుకోవాలని ఉత్తర్వులు ఇచ్చారు.

రహదారులపై వాహనాల రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని, చెక్ పోస్టుల వద్ద బోర్డులు, బ్యారికేడ్లు, తొలగించాలని డీటీవోలకు సూచించారు. అలాగే చెక్ పోస్టుల వద్ద ఉన్న రికార్డులు, పరికరాలు, ఫర్నిచర్‌ను డీటీవో కార్యాలయాలకు తరలించాలని ఆదేశించారు. అన్ని ఆర్థిక, పరిపాలనా రికార్డులను సరిచూసి భద్రపరచాలని హుకుం జారీ చేశారు. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన రవాణాశాఖ చెక్‌పోస్టుల్లో అవినీతి రవాణా అవుతోంది. కొందరు

అధికారులు ప్రైవేటు సిబ్బందిని పెట్టుకుని యథేచ్ఛగా అక్రమ వసూళ్లు కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలోని రవాణాశాఖ చెక్‌పోస్టులను రద్దు చేస్తూ జులై ఆఖరి వారంలోనే రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. నెలరోజులు ఆలస్యంగా జీఓ జారీ అయ్యింది. ఉత్తర్వులు వచ్చి దాదాపు రెండు నెలలు గడుస్తున్నా చెక్‌పోస్టులను ఇంకా తొలగించలేదు. జీఎస్టీ అమల్లోకి వచ్చాక చెక్‌పోస్టుల అవసరం దాదాపుగా తగ్గింది. కేంద్రం సూచనల మేరకు దేశంలోని అనేక రాష్ట్రాలుసంవత్సరాల క్రితమే చెక్‌పోస్టులను రద్దు చేశాయి. కానీ తెలంగాణలో కొనసాగుతున్నాయి. ఏడాదిన్నర క్రితమే తెలంగాణలో చెక్‌పోస్టుల రద్దుకు రవాణాశాఖ నిర్ణయం తీసుకున్నా.. కొందరు అధికారుల బలమైన ఒత్తిళ్ల కారణంగా ఇన్నాళ్లు ఆ నిర్ణయం వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు రెండు నెలల క్రితం జీఓ జారీ అయినా అవినీతి అధికారుల తీరు మారలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని చెక్‌పోస్టులు రద్దు చేయాలని రవాణాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. చెక్ పోస్టులను ఎత్తివేసిన ప్రభుత్వం వాటి స్థానంలో ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నైజేషన్ (ఏఎన్‌పీఆర్) అనే అడ్వాన్స్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురానుంది. ఈ అడ్వాన్స్‌డ్ కెమెరా సిస్టమ్ హైదరాబాద్ లోని ఖైరతాబాద్ లో ఉన్న ప్రధాన రవాణా శాఖ ఆఫీస్‌కు అనుసంధానమై ఉంటుంది. దీంతో రవాణా శాఖలో పారదర్శకత స్పష్టంగా కనిపించనున్నది. అయితే, ప్రస్తుతం డ్యూటీ చేస్తున్న సిబ్బందికి కొత్త బాధ్యతలు అప్పగించనున్నారు. ఏ వెహికల్ అయినా కెమెరా కండ్లుగప్పి ఇతర మార్గాల ద్వారా రాష్ట్రంలోకి వస్తే.. వాటిని జాతీయ రహదారులపై అడ్డుకొని చర్యలు తీసుకునేందుకు వీలుగా మొబైల్ స్క్వాడ్ లను కూడా రంగంలోకి దింపనున్నారు. ఈ వ్యవస్థపై ముందుగా గూడ్స్ ట్రాన్స్?పోర్ట్ చేసే వాహన యజమానుల అసోషియేషన్ కు ఆర్టీఏ అధికారులు అవగాహన కల్పించ నున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ప్యాసింజర్ వెహికల్స్‌తో పాటు సరకు రవాణా వాహనాల పర్మిట్లు, మిగిలిన అనుమతులన్నీ ముందే ఆన్ లైన్ లో పొందేలా రాష్ట్ర రవాణా శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి అనుమతుల్లేకుండా లేదా నిబంధనలు ఉల్లంఘించి రాష్ట్రంలోకి ప్రవేశిస్తే వెంటనే గుర్తించి చర్యలు తీసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.ఇప్పటి వరకు 15 చెక్ పోస్టుల అంతరాష్ట్ర చెక్ పోస్టుల దగ్గర విధుల్లో ఉన్న సుమారు 70 మంది ఎంవీఐలు, ఏఎంవీఐలు, ఇతర సిబ్బందిని ప్రస్తుతం రవాణా శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో నియమించనున్నారు. జీఎస్టీ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత జాతీయ రహదారులపై రవాణా సమస్యలు లేకుండా, సాఫీగా ప్రయాణం జరిగేందుకు వీలుగా చెక్ పోస్టులను ఎత్తేయాలని గతంలోనే కేంద్రం ఆయా రాష్ట్రాలను ఆదేశించింది.

# సందిగ్ధంలో నవీన్ నామినేషన్

(మొదటి పేజీ తరువాయి)

కాగా.. ఫామ్ 26లోని మొదటి మూడు పేజీలలో ఉన్న కాలమ్స్ విషయంలో అభ్యంతరాలున్నాయని బీఆర్ఎస్ అంటోంది. ఇదే కారణంతో పలువురు ఇండిపెండెంట్ అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించారు అని రిటర్నింగ్ అధికారి దృష్టికి తెచ్చిన బీఆర్ఎస్ తరఫున న్యాయవాది. అలాంటపుడు నవీన్ యాదవ్ అభ్యర్థిత్వాన్ని ఎలా ఒకే చేస్తారని ప్రశ్నించారు. దీనిపై రిటర్నింగ్ అధికారి ఉన్నతాధికారుల సలహా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

**చివరకు నవీన్ నామినేషన్‌కు లైన్‌క్లియర్**

బీఆర్ఎస్ అభ్యర్థి సునీత తన తరఫు న్యాయవాది ద్వారా.. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ నామినేషన్ (ఫామ్ 2B)పై అభ్యంతరాలు లేవనెత్తారు. ఫామ్ 26 (అఫిడవిట్)లో మొదటి మూడు పేజీల కాలమ్‌లలో తప్పులు ఉన్నాయని, నిర్దేశిత కాలమ్‌లు ఖాళీగా ఉన్నాయని వాదించారు. ఇదే కారణంతో పలు స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించారనీ ఆమె రిటర్నింగ్ అధికారి దృష్టికి తెచ్చారు. దానితో వారి వాదనను అంగీకరించిన రిటర్నింగ్ అధికారి పి.సాయిరాం, ఈ అభ్యంతరాలను పరిశీలించారు. మొదట్లో నవీన్ యాదవ్‌ను కార్యాలయంలోనే ఆపి, విచారణ చేశారు. నామినేషన్ అంగీకరించకుండా మళ్లీ పిలుస్తాం అని పక్కన పెట్టారు. తర్వాత వివరాలను తనిఖీ చేసి నవీన్ యాదవ్ మూడు సెట్ల నామినేషన్లు, అఫిడవిట్లు సరైనవని ధృవీకరించారు.దానితో నామినేషన్ అభ్యంతరాల హైడ్రామాకు తెరపడింది. ఈ ఉత్కంఠతో ఏం జరుగుతుందోనని భయపడిన కాంగ్రెస్ వర్గాలు తర్వాత హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

# నేడు తెలంగాణ కేబినేట్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

పాటు భవిష్యత్ కార్యాచరణపై కేబినెట్ చర్చించనుంది. దీంతో ఇటీవల భేటీలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఇద్దరు పిల్లల నిబంధన ఆర్డినెన్సుకు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. అలాగే, ఎస్ఎల్‌బిసి పునరుద్ధరణ పనులు, ఎస్ఆర్ఎస్‌పి రెండో దశకు రాంరెడ్డి దామోదర రెడ్డి పేరు, కాళేశ్వరం పునరుద్ధరణ సహా పలు ప్రాజెక్ట్ పనుల పై మంత్రి వర్గం చర్చించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలపై గురువారం జరిగే సమావేశంలో మంత్రి వర్గం తుది నిర్ణయం తీసుకోనుంది. పాత పద్ధతిలో ఎన్నికలకు వెళ్లాలా? లేదా 42 శాతం రిజర్వేషన్లతో వెళ్లాలా? అనేది దానిపై కేబినెట్ చర్చించనుంది. కాగా ఇప్పటికే ఈ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయనిపుణ్యులతో ఒక కమిటీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని న్యాయస్థానాల్లో కొట్లాడేందుకు రేవంత్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరో ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో విజయం సాధించేందుకు.. ప్రజలను తమ వైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీని అమలు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇంతకు ఏ పథకం అమలు చేస్తారన్న దానిపై ఇంకా క్లారిటీ రాలేదు. అయితే రాష్ట్ర మంత్రి వర్గం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుదనేది ఆసక్తిగా మారింది.

# అంతుచిక్కని ప్యారిస్ మ్యూజియం చోరీ

(మొదటి పేజీ తరువాయి)

కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అక్టోబరు 19న పారిస్‌లోని లౌవ్రే మ్యూజియంలో చోరీ జరిగింది. మ్యూజియంలో ఓ వైపు నిర్మాణం జరుగుతుండగా.. అక్కడి నుంచి దుండగులు లోపలికి చొరబడ్డారు. అనంతరం సరుకు రవాణా ఎలివేటర్‌లో అపోలో గ్యాలరీలోకి ప్రవేశించారు. నెపోలియన్ కాలంనాటి వస్తువులు, ఆభరణాలు ఉన్న గ్యాలరీ అద్దాలను పగలగొట్టి అందులోని తొమ్మిది వస్తువులను దొంగలించారు. వీరు వెళ్తుండగా.. అందులోని ఓ ఆభరణం మ్యూజియం బయట పడిపోయింది. మిగతా ఆభరణాల విలువ 88 మిలియన్ యూరోలు (భారత కరెన్సీలో దాదాపు రూ.895 కోట్లు) ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ చోరీకి పాల్పడిన దుండగులను పట్టుకునేందుకు దాదాపు 100 మందితో కూడిన దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ దొంగతనం చేసింది ఎవరనేది ఇంతవరకూ తేలలేదు. అయితే కరుడు గట్టిన దొంగల ముఠా పింక్ పాంథర్స్ పని అయి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ చోరీకి పాల్పడింది పింక్ పాంథర్స్ గ్యాంగ్ అని చెప్పేందుకు ఎలాంటి ఆధారాల్లేనప్పటికీ చోరీ జరిగిన తీరు ఆ ముఠాను గుర్తుకు తెస్తోంది. వీరు గప్‌చుప్‌గా వస్తారు. ఎలాంటి తొట్రుపాటు లేకుండా పని ముగించుకొని వెళ్లిపోతారు. మ్యూజియంలో చోరీకి పాల్పడిన వారు దొంగతనాల్లో ప్రొఫెషనల్స్‌గా కన్పించారు. ఇంతవరకూ వారి ఆచూకీ దొరకలేదు. పక్కా సమాచారం, ప్రణాళికతో దొంగతనానికి పాల్పడటం చూస్తుంటే పింక్ పాంథర్స్ పనే అనిపిస్తోంది అని ఫ్రాన్స్ స్క్వాడ్ బ్యూ'ది స్వీనీ' మాజీ చీఫ్ బ్యారీ ఫిలిప్స్ అభిప్రాయపడ్డారు. ఈ దొంగల ముఠా గత కొన్ని దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో భారీ చోరీలకు పాల్పడింది. అందరూ చూస్తుండగానే దొంగతనాలు చేయడం వీరి నైజం. కేవలం ఆభరణాలు, వజ్రాలనే దోచుకుంటారు. ఇప్పటివరకు 35 దేశాల్లో దాదాపు 500 మిలియన్ డాలర్ల ఆభరణాలను ఈ గ్యాంగ్ దొంగిలించినట్లు ఆధారాలున్నాయి. వీరి ముఠాలో ఎక్కువ మంది తూర్పు ఐరోపా దేశస్థులే ఉంటారు. కొన్ని రంగాల్లో నైపుణ్యం కలిగిన వ్యక్తులను రిక్రూట్ చేసుకుని చోరీలకు పాల్పడుతుంటారు. 1990ల్లో జరిగిన బోస్నియా యుద్ధంలో పాల్గొన్న సెర్బియన్ స్పెషల్ ఫోర్సెస్ సభ్యులు కూడా ఈ ముఠాలో ఉన్నట్లు గతంలో ఇంటర్‌పోల్ గుర్తించింది. మాజీ సైనికులు కావడంతో మిలిటరీ తరహా క్రమశిక్షణతో ఎలానింగ్ చేయడం ఈ గ్యాంగ్ అలవాటు. టార్గెట్ చేసే ప్రాంతంపై ముందుగానే నిఘా ఉంచుతారు. ఆ తర్వాత పథక రచన చేస్తారు. ఒకసారి చోరీ పూర్తయిన తర్వాత వెంటనే నకిలీ పాస్‌పోర్టులతో దేశం దాటేస్తారు. వీరికి అంతర్జాతీయంగా నెట్‌వర్క్ ఉంది. దొంగతనం చేసిన ఆభరణాలు, వజ్రాలను కరిగించడం లేదా వాటి ఆకృతి మార్చి మార్కెట్లో విక్రయిస్తుంటారని గత దర్యాప్తుల్లో తేలింది. ఓసారి ఈ పింక్ పాంథర్స్ గ్యాంగ్ దుబాయ్‌లోని ఓ మాల్‌లో చోరీకి పాల్పడింది. ఆ మాల్‌లోని నగల దుకాణంలోకి కార్లతో దూసుకెళ్లి చేతికందినన్ని వజ్రాలు, ఆభరణాలు తీసుకుని కేవలం 45 సెకన్లలో అక్కడి నుంచి పరారయ్యారు. జపాన్, బ్రిటన్ చరిత్రల్లోనే అతిపెద్ద నగల చోరీకి పాల్పడింది ఈ గ్యాంగే. ప్రముఖ హాలీవుడ్ చిత్రం పింక్ పాంథర్‌లో చూపించిన ఓ ట్రిక్‌లాంటిదే చేసి 2003లో లండన్‌లోని ఓ నగల దుకాణంలో వజ్రాలను చోరీ చేశారు. అప్పటి నుంచి ఈ గ్యాంగ్‌కు పింక్ పాంథర్ అని పేరొచ్చింది.

# రెండేళ్లలో ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

నూతన ఆసుపత్రి అవసరాలకు తగినట్లు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

అధునాతన పరికరాల ఏర్పాటుకు తగినట్లు గదులు, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణాలు ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు సీఎం సూచించారు. ఆసుపత్రి నిర్మాణ పనులతో పాటు స్థానికులకు ఇబ్బంది లేకుండా చుట్టూ రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. నిర్మాణ పనులు వేగవంతం చేయడానికి వైద్యారోగ్య శాఖ, పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ కమిటీ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పది రోజులకోసారి సమావేశమై ఏవైనా సమస్యలుంటే పరిష్కరించుకుంటూ పనులు వేగంగా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

పనుల వేగవంతానికి సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. రానున్న వందేళ్ల అవసరాలకు తగిన సదుపాయాలతో కొత్త ఉస్మానియా ఆసుపత్రి ఉండాలని.. ఆధునిక వైద్య పరికరాలతో అత్యాధునిక

సదుపాయాలు కల్పించాలని వెల్లడించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి నిర్మాణ సమీక్ష చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచనలు చేశారు.

స్థానికులకు ఇబ్బంది లేకుండా రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లోనూ ఆసుపత్రుల పనుల పర్యవేక్షణకు అధికారుల నియామకం జరిగిందన్నారు. వచ్చే జూన్ నాటికి అన్ని మెడికల్ కళాశాలలు, ఆసుపత్రుల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ట్రాఫిక్, భద్రతా ప్రణాళికలను ముందుగానే సిద్ధం చేయాలని పోలీసులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

ఈ సమావేశానికి సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శ్రీనివాసరాజు, శేషాద్రి, సెక్రటరీ మాణిక్ రాజ్, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, ఆర్ అండ్ బీ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఎంఏ అండ్ యూడీ సెక్రటరీ ఇలంబర్తి, డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, ఉన్నతాధికారులు హాజరయ్యారు.



# రాజన్న దర్శనాలను నిలిపేసిన అధికారులు

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం స్వామివారికి అభిషేకం చేసుకునే భక్తులకు మాత్రం అనుమతినివ్వగా భక్తుల సంఖ్య పెరిగిపోతుండడంతో ఆలయంలో రేకుల షెడ్డు తొలగించే పనుల్లో భాగంగా బంద్ చేసినట్లుగా ఆలయ అధికారులు వెల్లడించారు. ప్రచార సాధనాలు పెరిగాయని, ముందస్తు సమాచారం ఇచ్చి ఆలయాన్ని మూసివేస్తే బాగుంటుంది కదా అని భక్తుల అభిప్రాయపడ్డారు. ఒక్కసారిగా భక్తులు ఉత్తర ద్వారం వద్ద చేరుకొని ఉన్న కాస్త భక్తులైన దర్శించుకునేందుకు అనుమతి ఇవ్వాలని అధికారులను ప్రాధేయపడ్డారు. అధికారుల ఆదేశాల మేరకే భక్తులను నిలిపివేశామని భద్రత సిబ్బంది వెల్లడించడంతో గంటల తరబడి భక్తులు అవకాశం కోసం ఎదురు చూశారు. ఇక చేసేదేమీ లేక కొందరు భక్తులు బయట నుండే స్వామి వారికి దండం పెట్టి వెను తిరిగారు. మరోవైపు ఆలయంలో భక్తుల దర్శనాల నిలిపివేతపై స్పష్టమైన ప్రకటన ఇప్పటివరకు అధికారికంగా ఇవ్వకపోగా, గందరగోళాల మధ్య భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# రూపాయి బలోపేతానికి ఆర్‌బీఐ చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలో 88కి పడిపోయింది. ఆగస్టు నెలలో రూపాయి విలువ 1.6 శాతం వరకు క్షీణించడంతో కేంద్ర బ్యాంక్ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. సాధారణంగా మార్కెట్లో డాలర్‌కు డిమాండ్ పెరిగినప్పుడు రూపాయి బలహీనపడుతుంది.

అలాంటప్పుడు ఆర్బీఐ తన విదేశీమారక నిల్వల నుంచి డాలర్లను అమ్ముతుంది. దాంతో మార్కెట్లో డాలర్ల సరఫరా పెరిగి, రూపాయి విలువ స్థిరపడుతుంది. జూలై నెలతో పోలిస్తే ఆగస్టులో ఆర్బీఐ విక్రయించిన డాలర్లు ఏకంగా మూడు రెట్లు అధికం కావడం గమనార్హం. మార్కెట్లో తీవ్రమైన అనిశ్చితి ఉన్నప్పుడు మాత్రమే తాము జోక్యం చేసుకుంటామని ఆర్బీఐ స్పష్టం చేసింది. ఒకవైపు డాలర్లను విక్రయిస్తూనే మరోవైపు ఆర్బీఐ వ్యూహాత్మకంగా బంగారం నిల్వలను పెంచుకుంటోంది. రెండు నెలల విరామం తర్వాత సెప్టెంబర్‌లో కొత్తగా 200 కిలోల పసిడిని కొనుగోలు చేసింది.దాంతో ఆర్బీఐ దగ్గరున్న మొత్తం బంగారం నిల్వలు 880.18 టన్నులకు చేరాయి. వాటి విలువ సుమారు రూ. 8.36 లక్షల కోట్లుగా ఉంది. ఏ దేశ కేంద్ర బ్యాంకు వద్దనైనా బంగారం నిల్వలు ఎక్కువగా ఉంటే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ, కరెన్సీపై అంతర్జాతీయంగా నమ్మకం పెరుగుతుంది. సంక్షోభ సమయాల్లో బంగారం సురక్షితమైన ఆస్తిగా పనిచేస్తుంది. విదేశీ మారక నిల్వల్లో డాలర్ల వంటి కరెన్సీలు ఉన్నప్పటికీ, బంగారం నిల్వలు ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వాన్ని ఇస్తాయి. అధిక బంగారం నిల్వలు దేశ రేటింగ్ మెరుగుపడటానికి కూడా దోహదపడతాయి. తద్వారా తక్కువ వడ్డీకే అంతర్జాతీయ రుణాలు పొందే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆర్బీఐ చేపడుతున్న ద్వంద్వ వ్యూహం రూపాయిని బలోపేతం చేయడానికేనని విశ్లేషకులు భావిస్తున్నారు.




తెలుగు దినపత్రిక https://aksharagalam.com
# అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం

# తెలంగాణ రౌండప్

## టిపిసిసి అధ్యక్షునికి దీపావళి పండుగ శుభాకాంక్షలు



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 22, (అక్షర గళం):** దీపావళీ పర్వదినం సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్, ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి , కరీంనగర్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ లతో పాటు మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సారెడ్డి భూపతి రెడ్డిలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.



## లక్కీడ్రా విజేతలకు బహుమతులు అందజేత

**ఆమనగల్లు, అక్టోబర్ 22 (అక్షరగళం):** ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని శ్రీ ఎల్.వీ. ఆర్.ఎస్.వై షాపింగ్ మాల్ వారు ఏర్పాటు చేసిన దసరా మరియు దీపావళి షాపింగ్ బొనాంజా విజేతలకు యజమాని పున్నా రామకృష్ణ, యశ్వంత్ ఆధ్వర్యంలో బుధవారం బహుమతులు అందజేశారు. ఈ వేడుకలకు ఎఎస్ఐ మురళీధర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ దుడ్డు కృష్ణ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని పూలమాల శాలువాతో ఘనంగా సత్కరించి పులబోకే అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎలక్ట్రికల్ స్కూటీ మొదటి బహుమతి పట్టణానికి చెందిన ఎండీ. మౌలానా, మొబైల్ ఫోన్ రెండవ బహుమతి తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామానికీ చెందిన ఆంజనేయులు లకు అందజేశారు.

## ఇందిరమ్మ ఇళ్లు పరిశీలన

**ఆమనగల్లు, అక్టోబర్ 22 (అక్షర గళం):** ఆమనగల్లు మండల పరిధిలోని మంగళపల్లి, చింతలపల్లి, మాలేపల్లి గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను కమిటీ సభ్యులతో కలిసి ఎంపీడీవో కుసుమ మాధురి పరిశీలించారు. బుధవారం ఇళ్లను పరిశీలించి వాటి నిర్మాణ ఫొటోలను తీసి యాప్లో అప్లోడ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ..



ఇందిరమ్మ ఇంటి ఫొటోలను ప్రతివారం మొదటి రోజున యాప్లో అప్లోడ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఏపీఎం నీరజ, ఎంపీఓ వినోద, ఏపీఓ మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు మల్లేష్, పవన్, ఫీల్డ్ అసిస్టెంట్ లు వినోద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నారాయణరెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

**ఆమనగల్లు, అక్టోబర్ 22 (అక్షర గళం):**
ఆమనగల్లు, కడ్తాల్ మండలాల కాంగ్రెస్ నాయకులు బుధవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిసి పలు అభివృద్ధి పనులు, నిధుల మంజూరు గురించి వినతి పత్రాలు అందజేశారు. అదేవిధంగా ఎమ్మెల్యేకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పిటిసి శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, హన్మ నాయక్ తదితరులు ఉన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష జరిమానా

**- కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి**

**కల్వకుర్తి అక్టోబర్ 22 (అక్షర గళం):** మద్యం సేవించి వాహనం నడిపిన కల్వకుర్తి పట్టణానికి చెందిన దాసర్ల యాదయ్య డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టు పడడంతో బుధవారం కోర్టులో హాజరు పరచగా జూనియర్ సివిల్ జడ్జ్ కావ్య జాడ రెండు రోజులు జైలు శిక్షతో పాటు 600 జరిమానా విధించినట్లు ఎస్సై మాధవరెడ్డి తెలిపారు . మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

## యాక్సిడెంట్ కేసులో ఒకరికి 41 రోజులు జైలు శిక్ష

**- కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి**

**కల్వకుర్తి అక్టోబర్ 22 (అక్షర గళం):** వాహనం ఢీ కొట్టి యాక్సిడెంట్ కేసులో 41 రోజులు జైలు శిక్ష విధించినట్లు కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి బుధవారం మీడియాకు తెలిపారు ఎస్సై తెలిపిన వివరాలు తెలకపల్లి మండలం పెద్దూరు గ్రామానికి చెందిన జంగం వెంకటేష్ 2018 వ సంవత్సరంలో కేతావత్ దాసు జాజాల తండా వంగూరు మండలం తన గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కల్వకుర్తి పట్టణ సమీపంలోని కైలాస గుట్ట వద్ద నిందితుడు జంగం రమేష్ తన యొక్క వాహనంతో ఫిర్యాదు దారిని ఢీకొనగా తీవ్ర గాయాలయ్యాయి దీనిపై అప్పటి ఎస్సై రవి కేసు నమోదు చేశారు కోర్టులో జూనియర్ సివిల్ జడ్జ్ కావ్య జాడ యాక్సిడెంట్ కేసులో నిందితుడు జంగం రమేష్ కు 41 రోజులు జైలు శిక్ష విధించినట్లు వివరాలను ఎస్ఐ వెల్లడించారు.


## బహుళ అంతస్తుల నిర్మాణంపై మౌనమేళ...




- కలెక్టర్ ఆదేశాలనే బేఖాతారు చేస్తున్న నాగారం మున్సిపల్ కమీషనర్ ఎస్.భాస్కర్ రెడ్డి
- అక్రమ నిర్మాణాలకు కొమ్ము కాస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

**మేడ్చల్,మల్కాజ్గిరి జిల్లా,కీసర మండలం నాగారం పట్టణంలో విచ్చలవిడిగా,నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు నిర్మిస్తున్నా మున్సిపల్ యంత్రాంగం మాత్రం కళ్ళుండీ చూడలేక పోతుంది.**

**కీసర,అక్టోబర్ 22,(అక్షరగళం) :**
మేడ్చల్,మల్కాజ్గిరి జిల్లా,కీసర మండలం నాగారం పట్టణంలో విచ్చలవిడిగా, నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు నిర్మిస్తున్నా మున్సిపల్ యంత్రాంగం మాత్రం కళ్ళుండీ చూడలేక పోతుంది. అనుమతి ఒకలా తీసుకుని మరోలా నిర్మాణం చేపడుతున్నా.. మాకేంటి అన్నట్లు వ్యవహరిస్తోంది. నాగారం పురపాలక సంఘం పరిధిలోని నాగారం నుండి రాంపల్లి వెళ్లే ప్రధాన రహదారిలో




Prajavani Acknowledgement Receipt

Name:PHANI KUMAR
Mobile No. : 7036391081
Address:PLOT NO.18, GANDHI NAGAR, RAMPALLE,KEESARA,RAMPALLE
Village:RAMPALLE
Mandal:KEESARA
Grievance Subject:Requests

Your Grievance is Registered vide Registration no.MCNAG/E/2025/00094 On15-09-2025Please keep the registration number for all future correspondence. Your Grievance is sent to MC Nagaram

ప్లాట్ నెం. 04 గాంధీనగర్ రాంపల్లి చౌరస్తా పక్కన పాత భవనంపై ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి కమర్షియల్ భవనం నిర్మిస్తూ అదనంగా బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారని మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసిన నిమ్మకు నీరు ఎత్తినట్టుగా వ్యవహరిస్తున్న తీరు.జిల్లా కలెక్టర్ ఆదేశాలను కూడా పట్టించుకోని మున్సిపల్ కమిషనర్ ఎస్.భాస్కర్ రెడ్డి,టౌన్ ప్లానింగ్ అధికారులు. అయితే ఈ కట్టడాలు పూర్తిగా నిబంధనలను తుంగలో తొక్కుతూ.. అధికారుల చేతులు తడుపుతూ..




### బహుళ అంతస్తుల్లా యదేచ్ఛగా

రూపుదిద్దుకుంటున్నాయి. మరి ఇంతటి బహుళ అంతస్తులకు,మున్సిపల్ అధికారులు పర్మిషన్ ఎలా ఇచ్చారు..? ఎవరి అండతో రెచ్చిపోయి ఇంత పెద్ద పెద్ద కట్టడాలను ఏలా కడుతున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.




### తూతూ మాత్రంగా నోటీసులు

బహుళ అంతస్తులతో కూడిన భవనాన్ని నిర్మిస్తున్నారు. అయితే ఆ కట్టడానికి తీసుకున్న అనుమతులకు చేపడుతున్న నిర్మాణానికి సంబంధమే లేదని తెలుస్తోంది.అంతేకాదు అనుమతి లేని అదనపు ఫ్లోరు,పెంటౌస్ నిర్మాణం కూడా పూర్తి కావస్తున్న, ఫిర్యాదు చేస్తే కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపణలు,దాదాపు 80 శాతం పనులు పూర్తయినా మున్సిపల్ అధికారులు మాత్రం నోరు మెదపడం లేదని గుసగుసలాడుతున్నారు. చిన్న చిన్న నిర్మాణాలకు మాత్రం అన్నీ ఉన్నా అడ్డంకులు చెప్పే మున్సిపల్ అధికారులు మాత్రం ఇంత పెద్ద నిర్మాణం నిబంధనలకు విరుద్దంగా సాగుతున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



### భారీగా ముడుపులు..

నిర్మాణం వైపు కన్నెత్తి కూడా చూడకుండా ఉండేందుకు మున్సిపల్ అధికారులకు భారీగానే డబ్బులు అందుతున్నట్లు స్థానికులు చర్చించుకోవడం గమనార్హం.అందుకే పెద్ద పెద్ద అక్రమ కట్టడాలు సాగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగాన్ని పూర్తిగా మనీ ప్లానింగ్ సెక్షన్ గా మార్చివేశారని పలువురు అంటున్నారు.

### అధికారుల అండదండలతోనే అక్రమంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు

ఈ అక్రమ నిర్మాణాలకు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులే వెన్నుదన్నుగా నిలుస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెద్ద పెద్ద నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా కడుతున్న,ఈ అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తున్నా చర్యలు తీసుకోవడం కాదు కదా.. కనీసం తనిఖీలు కూడా చేసే పరిస్థితిలో కూడ లేరని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపల్ అధికారుల అండదండ లతోనే అక్రమంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయని మండిపడుతున్నారు.ఇట్టి నిర్మాణంపై మున్సిపల్ కమిషనర్,టౌన్ ప్లానింగ్ అధికారులకు మరియు కలెక్టర్ కి ఫిర్యాదు చేసిన నిమ్మకు నీరు ఎత్తనట్టుగా వ్యవహరిస్తున్న తీరు.ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించి అక్రమ కట్టడాలను అరికట్టి ప్రభుత్వ ఖజానాకు గండిపడకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.







## అమరవీరుల త్యాగం స్ఫూర్తిదాయకం

**- బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్**

**కూకట్పల్లి, అక్టోబర్ 22 , (అక్షర గళం):** అమరవీరుల త్యాగం స్ఫూర్తిదాయకమని బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా బుధ వారం బాలానగర్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన 'ఓపెన్హౌస్' కార్యక్రమం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సంద ర్భంగా పోలీసుల విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలు, ఇతర పరికరాలను పరిశీలించడంతో పాటు సైబర్ నేరాలపై అవగాహన పొందారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ, విధి నిర్వహణలో వారు ఉపయోగించే ఆయుధాలు, పరికరాల గురించి విద్యార్థులు తెలుసుకోవడం ఎంతో అవసరమని బాలా నగర్ సీఐ నర్సింహా రాజు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్ , ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఇటీవల నిజామాబాద్లో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కాని స్టేబుల్ ప్రమోద్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటిం చారు. డీసీపీ సురేష్ కుమార్ స్వయంగా విద్యార్థులకు పెరుగు తున్న సైబర్నేరాలపై అవగాహన కల్పించారు. శిబిరంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల ఆయుధాలను పరిశీలించడంతో పాటు, వాటిని ఏ విధంగా, ఏ సందర్భంలో పోలీసులు వినియోగిస్తారో వివరించి అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎంతో ఆసక్తిగా ఆయుధాల గురించి తెలుసుకుని, తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. పోలీసుల విధి నిర్వహణలో కష్టాన్ని, శ్రమను అర్థం చేసుకుని వారి నుంచి స్ఫూర్తిని పొందాలని డీసీపీ సురేష్ కుమార్ విద్యార్థులకు సూచించారు. సమాజ భద్రత, దేశ రక్షణకు అమరులైన పోలీసుల త్యాగాలను వారోత్సవాల్లో భాగంగా స్మరించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ, బ్రైట్ కాన్సెప్ట్, హెచ్ఏఎల్ సెకండరీ, నావజ్యోతి, సదశివా, శ్రీ సాయి విద్యానికేతన్, విజన్ మోడల్ హై స్కూల్ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. పోలీస్ శాఖకు సంబంధించిన వివిధ రకాల ఆధునిక ఆయుధాలు, ఆయుధ పరికరములు, కమ్యూనికేషన్ పరికరములు, వాటి పనితీరుకు సంబంధించిన వివరాలను విద్యార్థులకు వివరించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐలు హాజీ మియా, సరిత రెడ్డి, వినోద్ కుమార్, ఏఎస్ఐ హనుమయ్య, ఐటీ సెల్, క్లూస్ టీం, ట్రాఫిక్, సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

## భీం స్ఫూర్తిని కొనసాగించాలి

**ఆమనగల్లు, అక్టోబర్ 22 (అక్షర గళం):**
నేటి యువత కుమురం భీం స్ఫూర్తిని కొనసాగించాలని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, అన్నారు. కడ్తాల్ పట్టణ కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బిచ్య నాయక్ ఆధ్వర్యంలో బుధవారం భీం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం గూడూరు శ్రీనివాస్ రెడ్డి, యాట నర్సింహా లు మాట్లాడుతూ.. ఆదివాసీ హక్కుల కోసం పోరాటం చేసి అసువులు బాసిన భీం స్ఫూర్తితో ఆదివాసీలు మరింత అభివృద్ధి చెందాలన్నారు. ఆదివాసీల పిల్లలను ప్రభుత్వ, ఆశ్రమ, గిరిజన గురుకుల పాఠశాలలో చదువు నేర్పించాలని కోరారు. చదువుతోనే ఆదివాసీలు మరింత అభివృద్ధి చేందడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ చేగురి వెంకటేష్, డిసిసి ప్రధాన కార్యదర్శి భీఖ్యా నాయక్, మండల సేవాదళ్ అధ్యక్షులు లక్ష్మయ్య, మాలె మల్లేష్, సత్యం యాదవ్, యాదయ్య, శంకర్, వడ్డే రాజు, రవీందర్, పత్య నాయక్, జంగయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.





## ప్రారంభమైన తుల్జా భవాని విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు

**ఆమనగల్లు, అక్టోబర్ 22 (అక్షర గళం):** కడ్తాల్ మండలం కాన్గుబాయితాండలో శ్రీశ్రీశ్రీ తుల్జా భవాని మాత దేవాలయ దేవత విగ్రహ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు బుధవారం తుల్జా భవాని దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఉదయం నుండి గణపతి పూజ, స్వస్తి పుణ్యావాచనం ,అఖండ దీపారాధన, అంకురార్పన, గోపూజ, యాగశాల ప్రవేశం మండప ధారణ మరియు అమ్మవారి నూతన విగ్రహాన్ని స్థానిక వీధుల గుండా ఊరేగిస్తూ మహిళలు పెద్ద ఎత్తున మంగళ దీపాలతో ఆలయానికి అమ్మవారి విగ్రహాన్ని తీసుకొచ్చారు. అనంతరం హోమ కార్యక్రమాలు చేపట్టారు. వేడుకలలో భిక్య నాయక్, పాండు, బిచ్య, బిచ్యా నాయక్, నర్సింగ్, లక్ష్మణ్, నరేష్, జన్య, రాజు, దేవుల మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## యూసుఫ్‌గూడా ఇంచార్జిగా ఫరీద్

**ఆమనగల్లు, అక్టోబర్ 22 (అక్షర గళం):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రచారం నిమిత్తం 50 మంది ఎన్ఎస్ఈయుఐ నాయకులతో ప్రచార క్యాంపియన్ కమిటీని నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ అఫ్రాజ్ ముల్లా, రాష్ట్ర అధ్యక్షులు యడవల్లి వెంకటస్వామి, ఉపాధ్యక్షులు రితీష్ రావు లు ఉత్తర్వులు బుధవారం జారీ చేశారు. క్యాంపియన్ కమిటీలో ఆమనగల్లు పట్టణానికి చెందిన ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్ యూసుఫ్ గుడా ఇన్చార్జిగా నియమితులయ్యారు. పార్టీ మెజార్టీ విజయమే లక్ష్యంగా క్యాంపియన్ సభ్యులు ప్రచారం చేయాలని ఆదేశించినట్లు ఆయన చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుతోనే జూబ్లీహిల్స్ అభివృద్ధి సాధ్యమని ఫరీద్ పేర్కొన్నారు. రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అగ్రగామిగా దిద్దుతుందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కానీ అభివృద్ధి పనులు తమ ప్రభుత్వం రెండేళ్లల్లోనే చేసిందన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి కాకపోవడానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణం అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో తమ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు ఖాయమని ఫరీద్ ధీమా వ్యక్తం చేశారు. తనపై నమ్మకం ఉంచి అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు.



## రోడ్డు ప్రమాదంలో మృతిపై కేసు నమోదు

### కల్వకుర్తి ఎస్సై మాధవరెడ్డి

**కల్వకుర్తి, అక్టోబర్ 22 (అక్షర గళం):** ద్విచక్ర వాహనంపై వస్తుండగా అదుపు తప్పి మృతిచెందిన సంఘటనపై బుధవారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం వెల్దండకు చెందిన బొక్క నరసింహ ఫిర్యాదు తన చెల్లెలు సిరిగిరి స్వాతి భర్త సైదులతో కలిసి కల్వకుర్తి మున్సిపాలిటీ సిలారిపల్లి ఈనెల 18న భార్య భర్తలు ఇద్దరూ వెల్దండ గ్రామం నుండి ద్విచక్ర వాహనంపై బయలుదేరి వస్తుండగా కల్వకుర్తి పట్టణంలోని జింజర్ హౌస్ ముందు రోడ్డుపై అదుపు తప్పి బైక్ కింద పడడంతో స్వాతి తలకు తీవ్ర గాయాలు కావడంతో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్లోని గాంధీ ఆసుపత్రి నందు చికిత్స పొందుతుండగా బుధవారం ఉదయం 10 గంటలకు మృతి చెందిందని బొక్క నరసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై మాధవరెడ్డి తెలిపారు.

## రైతులు అప్రమత్తంగా ఉండాలి

### - డాక్టర్ శ్యాంసుందర్

**వెల్దండ, అక్టోబర్ 22 (అక్షర గళం):** వెల్దండ మండల పరిధిలోని రైతులు మూగ జీవాలకు సిజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని వెల్దండ మండల





పశు వైద్య అధికారి డాక్టర్ శ్యాంసుందర్ పేర్కొన్నారు. వెల్దండ మండల పరిధిలోని బైరాపూర్ కుప్పగండ్ల గ్రామాలలో పశువులకు గాలికుంటు వ్యాధి రోగ నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సలహాలు, చూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది నరేష్ రెడ్డి, నరసింహ, ఫణిందర్ రెడ్డి, శ్రీను, తిరుపతయ్య, గోపాలమిత్రలు బాలు, మొగులయ్య, సాయిబాబా, విజేందర్ రైతులు విష్ణు భరత్ చెన్నయ్య గౌడ్ రవీందర్ రెడ్డి నారయ్య తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిని విస్తరించాలి

**ఆమనగల్లు, అక్టోబర్ 22 (అక్షర గళం):** హైదరాబాద్... శ్రీశైలం జాతీయ రహదారిని ఆరు లైన్లుగా విస్తరించాలని కాంగ్రెస్ నాయకులు నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవిని కోరారు.

బుధవారం ఈ మేరకు హైదరాబాదులోని ఆయన నివాసంలో మల్లురవి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబెద్దుల్లా కొత్వాల్ లను కలిసి టీపీసీసీ సభ్యుడు అయిల్ల శ్రీనివాస్ గౌడ్, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా లు మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. రోడ్డు విస్తరించకపోవడం వల్ల వాహనాల రద్దీ పెరిగి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో శ్రీశైలం రోడ్డును మూడు లైన్లుగా విస్తరించడం జరిగిందన్నారు. ప్రస్తుతం వాహనాల రద్దీ, ప్రయాణికుల రాకపోకలు 10 రెట్లు పెరిగాయి అన్నారు.

అందుకు అను గుణంగా జాతీయ రహదారిని ఆరు లైన్లుగా విస్తరించి రాకపోకలకు ఇబ్బందులు తొలగించాలని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఎంపీ మల్లు రవి జాతీయ



రహదారి విస్తరణ గూర్చి ఇప్పటికే కేంద్రమంత్రి గడ్కరిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా శ్రీశైలం రోడ్డు విస్తరణ గూర్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నట్లు మల్లు రవి పేర్కొన్నట్లు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు : ఎస్సై కురుమూర్తి

**వెల్దండ, అక్టోబర్ 22 (అక్షర గళం):**

మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్దండ ఎస్సై కురుమూర్తి అన్నారు బుధవారం వెల్దండ మండల పోలీసులు ఎన్‌ఫోర్స్‌మెంట్ వీధులలో భాగంగా వెల్దండ పోలీస్ స్టేషన్ ఎదుట శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేయగా జడ్చర్ల మండలం పెద్ద ఆదిరాల చిన్న ఆదిరాల గ్రామానికి చెందిన చింతకింది నరసింహ అనే వాహన దారుడు మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టు పడ్డట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు.

నరసింహకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా మద్యం సేవించి నట్లు నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేసి కల్వకుర్తి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై కురుమూర్తి పేర్కొన్నారు.

కల్వకుర్తి జూనియర్ సివిల్ న్యాయమూర్తి జాడ కావ్య నిందితునికి రెండు రోజులు సాధారణ జైలు శిక్ష 600 రూపాయలు జరిమానా విధించారని ఎస్సై కురుమూర్తి తెలిపారు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టు బడితే జైలు తరలిస్తామని ఎస్సై కురుమూర్తి వాహన దారులకు హెచ్చరించారు.

## బీసీ జేఏసీ ఆధ్వర్యంలో తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేత

### 42% రిజర్వేషన్లు కల్పించాలని బిసి జేఏసీ నేతల డిమాండ్

**కల్వకుర్తి అక్టోబర్ 22 (అక్షర గళం):** కల్వకుర్తి పట్టణంలో బిసి జేఏసి ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయంలోని ఎమ్మార్వోగారికి 42 శాతం రిజర్వేషన్ ఈ సందర్భంగా బిసి జేఏసీ నేతలు సదానంద గౌడ్, రుక్కుల్ గౌడు,గోపాల్ మాట్లాడుతూ 42శాతం బీసీ రిజర్వేషన్స్ అమల వరకు స్థానిక సంస్థల ఎన్నికలు బహిష్కరించాలని పిలుపు ఢిల్లీకి తీసుకువెళ్లి గౌరవ ప్రధానమంత్రి ,రాష్ట్రపతిని కలిసి బిసి రిజర్వేషన్ల సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో కరెంటు రాజన్న మార్చల సురేష్ సుధాకర్







సాధనకై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహం నుండి బీసీ జేఏసీ నేతలు ర్యాలీగా ఎంఆర్ఓ ఆఫీస్ వద్దకు నినాదాలు చేసుకుంటూ వచ్చి వినతిపత్రం అందజేశారు. నిచ్చారు.

బిసి రిజర్వేషన్స్ సాధన కోసం మరో స్వాతంత్ర పోరాటంలా ఉద్యమించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వము అఖిలపక్ష బృందాన్ని శ్రీనివాస్,రమేశ్ , భానుచందర్,బాబీ దేవ్ భగత్ సింగ్,సురేందర్ గౌడు సోమాజీ,రామకృష్ణ, ధారమని గణేష్ మొదలగు రువు బీసీ చేసినట్లు పాల్గొన్నారు.

## జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయాన్ని సందర్శించిన రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ డైరెక్టర్

**మేడ్చల్ ప్రతినిధి, అక్టోబర్ 22, (అక్షర గళం):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యా లయాన్ని తెలంగాణ రాష్ట్ర వైద్య , ఆరోగ్య శాఖ డైరెక్టర్ డా. బి. రవీందర్ నాయక్ బుధవారం సందర్శించారు. అనం తరం ఆయన జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ అధికారి డా. ఉమా గౌరి , జిల్లా ప్రోగ్రాం అధికారులు, సెక్షన్ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా అమలవుతున్న టీబీ, ఎన్‌సీడీ, ఇమ్యూనైజేషన్, ఫ్యామిలీ ప్లానింగ్, ఆసుపత్రుల నిర్వహణ వంటి అన్ని ఆరోగ్య కార్యక్రమాలపై వివరణాత్మక సమీక్ష నిర్వహించి, భవిష్యత్ కార్యచరణ ప్రణాళికలపై సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో



జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ అధికారి డా. ఉమా గౌరి, ప్రోగ్రాం అధికారులు డా. మల్లీశ్వరి, డా.చంద్రకళ, డా. శ్రీదేవి, డా.సత్యవతి, డా. కౌశిక్, డా.వినోద్, వసంత కుమారి, కార్యాలయ అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.



## రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డికి దీపావళి శుభాకాంక్షలు

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 22, (అక్షర గళం):** దీపావళీ పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డిని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ వజ్రేష్ యాదవ్, ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి , టిపిసిసి జనరల్ సెక్రెటరీ పీసరి మహిపాల్ రెడ్డి తో పాటు మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి లు మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

## పిల్లలను అనుమతి లేకుండా బయటకు పంపించొద్దు

### - మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశం

**హైదరాబాద్, అక్టోబర్22, (అక్షర గళం):** ప్రజా ప్రతినిధులు విధిగా గురుకుల హాస్టల్ లు సందర్శించాలి.. పిల్లలను అనుమతి లేకుండా బయటకు పంపించడానికి లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. నైట్ డ్యూటీ లో ఉన్న టీచర్ విధిగా అన్ని రూమ్ లు పరిశీలిస్తూ ఉండాలి.. స్టడీ హార్స్ లో విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి.. విద్యార్థులకు కౌన్సిలింగ్ కార్యక్రమాలు విధిగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన సురక్షితమైన తాగునీరు అందించాలి, విద్యార్థులకు సమయానికి వేడి భోజనం అందించాలి. వాష్ రూమ్ తలుపులు, కిటికీ మెష్‌లు సక్రమంగా ఉండేలా సంరక్షించాలి.

పాఠశాల ప్రాంగణం క్రమం తప్పకూడా శుభ్రపరచాలి.. ఎలుకలు, పాములు వంటి ప్రాణుల నుండి ప్రమాదం కలుగకుండా పొదలు చెత్త తొలగించాలి. హెల్త్ సూపర్వైజర్లు విద్యార్థులలో దీర్ఘకాలిక వ్యాధులు గుర్తించి వెంటనే వారి తల్లిదండ్రులకు సమాచారం అందించాలని మంత్రి ఆదేశించారు.

## పండుగల వేళ స్పెషల్ ట్రైన్స్

### హర్షం వ్యక్తంచేస్తున్న ప్రయాణికులు

### 973 ట్రైన్స్ నడుపుతున్న దక్షిణమధ్య రైల్వే

**హైదరాబాద్, అక్టోబర్22, (అక్షర గళం):** దసరా, దీపావళి, ఛట్ పూజ వంటి పండు గలను తమ కుటుంబ సభ్యులతో జరుపుకునేందుకు అందరూ ఆసక్తి చూపిస్తారు. దీంతో పండగల సందర్భంగా రైల్వేల్లో రద్దీ సహజంగానే పెరుగుతోంది. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని రైలు ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా భారతీయ రైల్వే దేశవ్యాప్తంగా 12,011 ప్రత్యేక రైళ్లను నడిపిస్తోంది. ఈ ప్రత్యేక రైళ్లన్నీ 21 సెప్టెంబర్, 2025 నుంచి 30 నవంబర్, 2025 వరకూ నడుస్తాయి. ఇందులో దక్షిణ మధ్య రైల్వే 973 ప్రత్యేక రైళ్లను నడిపిస్తోంది.

21 సెప్టెంబర్, 2025 నుంచి 30 నవంబర్, 2025 మధ్యన వివిధ జోన్లకు సంబంధించిన స్పెషల్ ట్రైన్స్ తో కలిపి.. మొత్తం 2,285 రైళ్లు దక్షిణ మధ్య రైల్వే మీదుగా ప్రయాణిస్తున్నాయి. ఇలా గతేడాది.. ప్రయాణించిన 1,924 రైళ్లతో పోలిస్తే ఈ సంవత్సరం 19% ఎక్కువగా ప్రత్యేక రైళ్లు దక్షిణ మధ్య రైల్వే మీదుగా ప్రయాణం సాగిస్తున్నాయి. ఈ రైళ్లన్నీ ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ తదితర రాష్ట్రాల మీదుగా ప్రయాణం సాగిస్తున్నాయి.

21 సెప్టెంబర్, 2025 - 20 అక్టోబర్, 2025 మధ్య నెల రోజుల సమయంలో దక్షిణ మధ్య రైల్వే పెరిగిన రద్దీని దృష్టిలో ఉంచుకుని నడిపిన అదనపు రైళ్లతో కలిపి మొత్తం 1,010 ప్రత్యేక రైళ్లను నడిపింది. ఇందులో 399 రైళ్లను జోన్ పరిధిలో నడపగా, 611 రైళ్లను ఇతర జోన్లకు నడిపింది. ఇవి గతేడాది ఇదే సమయంలో నడిపిన 684 ప్రత్యేక రైళ్లతో పోలిస్తే 47% ఎక్కువ. ఈ సమయంలో ప్రయాణం సాగించిన రోజువారీ రైళ్లతోపాటుగా ఈ స్పెషల్ ట్రైన్స్ సేవలను దాదాపు 5 కోట్ల



మంది సద్వినియోగం చేసుకున్నారు.

గతేడాది ఈ పండుగల సమయంలో 1 అక్టోబర్, 2024 నుంచి 31 అక్టోబర్, 2024 వరకు దాదాపు 4.5 కోట్ల మంది దక్షిణమధ్య రైల్వే స్పెషల్ ట్రైన్స్, రెగ్యులర్ ట్రైన్స్ సేవలను పొందారు. ప్రత్యేక రైళ్ళకు అదనంగా రోజువారీ నడుస్తున్న రైళ్లలో ఉన్న వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికుల సౌకర్యార్థం 237 అదనపు కోచ్ లను ఆయా రైళ్లకు అనుసంధానించారు. అంతేకాకుండా హైదరాబాద్ నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్లలో రద్దీని నివారించడానికి లింగంపల్లి, హైటెక్ సిటీ, చర్లపల్లి, మల్కాజ్ గిరి వంటి రైల్వేస్టేషన్లలో అదనపు స్టాఫ్ లను ఏర్పాటు చేశారు. రైల్వేశాఖ అందిస్తున్న సేవల పట్ల ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.

రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ రైల్వే స్టేషన్లను, రైళ్లను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ పండుగ వేళ భారతీయ రైల్వే ప్రయాణికులకు అందిస్తున్న సేవల పట్ల వారి అభిప్రాయాలను నేరుగా అడిగి తెలుసుకుంటూ, తదనుగుణంగా అవసరమైన అదనపు సేవలను అందించేందుకు కృషి చేస్తున్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి కూడా దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

# రేవంత్ రెడ్డి ప్రకటనలు ఘనం.. ఆచరణ శూన్యం!

### గాలి మాటలతో ప్రజలను ఇంకెంత కాలం మోసం చేస్తవు రేవంత్ రెడ్డి? : మాజీ మంత్రి హరీష్ రావు

హైదరాబాద్,(అక్షర గళం): ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ కోసం నియమించిన స్కావెంజర్లకు 9 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం సిగ్గుమాలిన చర్య! చిరు ఉద్యోగుల శ్రమను, కష్టాన్ని గౌరవించడం మీకు చేతకాదా? కాంగ్రెస్ పాలనలో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు బెనిఫిట్స్ కోసం, స్కావెంజర్ల వంటి చిరు ఉద్యోగులు వేతనాల కోసం ఎదురుచూస్తూ నరకయాతన అనుభవిస్తున్నారు. మరోవైపు పేద విద్యార్థుల కడుపు నింపే మధ్యాహ్న భోజన పథకం నిధులు సైతం ఏడాదిగా పెండింగ్‌లో పెట్టారు. కెసిఆర్ ప్రారంభించిన సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని నిలిపివేశారు. మధ్యాహ్న భోజన పథకం బిల్లులు చెల్లించకుండా అమలు గాలికి వదిలేశారు. విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న మీకు.. మీ సొంత శాఖలో ఉపాధ్యాయులు, ఉద్యోగుల వేతన సమస్యలు కనిపించడం లేదా? ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తామని గొప్పలు చెప్పి, ఆచరణలో మాత్రం గాలికి వదిలేశారు.

మీ మాటల మాయాజాలంతో ఎంతకాలం ఉద్యోగులను మోసం చేస్తారు? సుదీర్ఘ కాలం పాటు ప్రజలకు సేవలందించిన విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగుల హక్కులైన బెనిఫిట్స్ ఇవ్వకుండా వారిని మానసికంగా వేధించడం అమానవీయం, అనైతికం!

రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం నెలలు తరబడి ఎదురు చూస్తున్నామని చెబుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆవేదన వింటే మనసు




చెలించిపోతున్నది. మధ్యాహ్న భోజన పథకం సహా విశ్రాంత ఉపాధ్యాయ, ఉద్యోగులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని, స్కావెంజర్ల 9 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

# రండి... రండి... మా తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

### దిగ్గజ సంస్థ 'ఒరికా'కు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం
### ఆస్ట్రేలియాలో సీఈఓ సంజీవ్ గాంధీతో ప్రత్యేకంగా భేటీ

హైదరాబాద్, (అక్షర గళం): దేశంలోనే పారిశ్రామికాభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలుస్తున్న తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఆస్ట్రేలియా ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలను నిర్వహిస్తున్న దిగ్గజ సంస్థ 'ఒరికా' ప్రతినిధులను మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ఆ దేశ పర్యటనలో భాగంగా బుధవారం మెల్‌బోర్న్‌లో పారిశ్రామిక పేలుడు పదార్థాల తయారీ, మైనింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర రంగాల్లో అంతర్జాతీయ అగ్రగామిగా ఉన్న ఆ సంస్థ సీఈఓ, ఎండీ సంజీవ్ గాంధీ, ఇతర ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

తెలంగాణలో 'ఒరికా' ప్రస్తుత కార్యకలాపాలు, భవిష్యత్తు విస్తరణ ప్రణాళికలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. 'ఇన్నోవేషన్, టెక్నాలజీ హబ్‌లను ఏర్పాటు చేసేందుకు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తెలంగాణ వైపు చూస్తున్నాయి. జీసీసీలు, పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రం అత్యంత అనుకూలం. పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించే ప్రగతిశీల విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ఎకో సిస్టమ్, స్థిరమైన ప్రభుత్వం, సమర్థవంతమైన నాయకత్వం అందుబాటులో ఉంది' అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు కంపెనీ ప్రతినిధులకు వివరించారు.

ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్, సస్టైయినబిలిటీ, మాన్యుఫాక్చరింగ్, మైనింగ్ రంగాల్లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం తెలంగాణతో కలిసి పని



చేసేందుకు ముందుకు రావాలని ఆహ్వానించారు. 'పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చొరవ, అమలు చేస్తున్న ప్రోత్సాహకర, ప్రగతిశీల విధానాలు అభినందనీయం. ప్రస్తుతం హైదరాబాద్‌లోనిర్వహిస్తున్న జీసీసీలో డిజిటల్ ఇంజనీరింగ్, ఆటోమేషన్, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్ తదితర రంగాల్లో 600 మంది హై స్కిల్డ్ నిపుణులకు ఉద్యోగాలు కల్పించాం.

రాబోయే రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. తెలంగాణలో కార్యకలాపాల విస్తరణ, వివిధ రంగాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నాం' అని ఒరికా సంస్థ సీఈఓ, ఎండీ సంజీవ్ గాంధీ తెలిపారు. 'ఆస్ బయోటెక్ 2025 ఇంటర్నేషన్ కాన్ఫరెన్స్'లో కీలకోపన్యాసం చేసేందుకు ఆస్ట్రేలియాకు విచ్చేసిన మంత్రి శ్రీధర్ బాబును కంపెనీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.




# సైన్స్, ఆవిష్కరణలకు కేంద్రం హైదరాబాద్

- యువ ఆవిష్కర్తలు దూసుకు వెళ్తున్నారు
- ప్రపంచస్థాయి వ్యవస్థల రూపకల్పనకు కేంద్రంగా తెలంగాణ
- పరిశోధనా సంస్థలు, పెట్టుబడిదారులకు స్వాగతం
- ప్రపంచ స్థాయి మౌలిక వసతుల కల్పనకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ప్రకృతిని మించిపోవడం కాదు దాని నుంచి నేర్చుకోవడం మన కర్తవ్యం
- Jrc కన్వెన్షన్‌లో జరుగుతున్న bioinspired frontiers 2025 అంతర్జాతీయ సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

హైదరాబాద్,(అక్షర గళం): పండిట్ జవహర్లాల్ నెహ్రూ కాలం నుంచి హైదరాబాద్ సైన్స్ మరియు ఆవిష్కరణలకు కేంద్రంగా విరాజిల్లుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం jrc కన్వెన్షన్‌లో నిర్వహించిన Bioinspire ఫ్రాంటియర్స్ 2025 – ఇంటర్నేషనల్ కాన్ఫ రెన్స్ ఆన్ స్పేస్ ఎకానమీ, బయోమిమిక్రి & ఎక్స్‌ట్రాటెరెస్ట్రియల్ రిసోర్స్ సదస్సులో ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం ప్రసంగించారు.

ప్రపంచస్థాయి వ్యవస్థల రూపకల్పనకు కేంద్రంగా తెలంగాణ నిలిచింది అన్నారు. హైదరాబాద్ కు ప్రపంచ స్థాయి పరిశోధన సంస్థలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పక్షాన ఆహ్వానం పలుకుతున్నామని తెలిపారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతుల కల్పనకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది అన్నారు.

హైదరాబాదు నగరానికి ప్రపంచ నలుమూలల నుంచి విచ్చేసిన శాస్త్రవేత్తలు, పరిశ్రమ నాయకులు, ఆవిష్కర్తలకు ఆయన స్వాగతం తెలిపారు. శాస్త్ర సున్నితత్వం మరియు కల్పనాత్మకత కవిత్వం కలిసిన ఈ నగరం ఎప్పుడూ సృజనాత్మకతకు నిలయంగా నిలిచింది అన్నారు.

బయోఇన్స్పైర్డ్ ఫ్రాంటియర్స్ 2025జీవశాస్త్రం, సాంకేతికత, అంతరిక్ష అన్వేషణల మధ్య జరుగుతున్న ఈ ప్రపంచ స్థాయి సంభాషణ భారత శాస్త్రీయ గమ్యాన్ని అర్థ శతాబ్దానికి పైగా నిశ్శబ్దంగా మలిచిన ఈ నగరంలో జరుగుతుండటం గర్వకారణం అన్నారు.

హైదరాబాద్‌కు సైన్స్‌తో ఉన్న అనుబంధం లోతైనది మరియు చిం కాల మైనది అన్నారు. భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో ఈ నగరంలో అనేక శాస్త్రీయ సంస్థలు పునాది వేసుకున్నాయి అని వివరించారు.

నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (NRSC)- మునుపటి NRSA– హైదరాబాద్‌ను భారతదేశపు "ఆకాశనేత్రం"గా మార్చింది. ఉపగ్రహ చిత్రాలను వ్యవసాయం, నీటి వనరులు, విపత్తు నిర్వహణలో విని యోగిస్తూ మార్గదర్శిగా నిలిచిందని తెలిపారు.

రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (DRDO) ఇక్కడ DRDL, DMRL, RCI వంటి ప్రతిష్ఠాత్మక ప్రయోగశాలలను స్థాపించి, దేశానికి క్షిపణి, పదార్థ సైన్స్ లో నైపుణ్యాన్ని అందించిన తరతరాల శాస్త్రవేత్తలను తీర్చిదిద్ది ఘనత హైదరాబాద్ కు సొంతం అన్నారు.

ఇవే కాకుండా భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (BDL), మిశ్ర ధాతు నిగమ్ (MIDHANI), ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ECIL) వంటి పబ్లిక్ రంగ సంస్థలు కూడా ఇక్కడే ఎదిగి, దేశానికి విమానయాన, లోహశాస్త్రం, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో బలమైన పునాది వేశాయి అని తెలిపారు.

ఈ దశాబ్దాల ప్రజా పెట్టుబడి, శాస్త్రీయ స్ఫూర్తి కలయికతో రూపుదిద్దుకున్న ఈ పరిసర వ్యవస్థే హైదరాబాద్‌కు ప్రత్యేకమైన "సైన్స్ డీఎన్ఏని ఇచ్చింది,అది క్రమశిక్షణతో కూడినది, సృజనాత్మకమైనది, నిశ్శబ్దంగా కానీ స్పష్టమైన ఆశయాలతో కూడింది అన్నారు.

ఈ వారసత్వాన్ని నేటి యువ ఆవిష్కర్తలు కొత్త ఉత్సాహంతో ముందుకు తీసుకెళ్తున్నారని డిప్యూటీ సీఎం ఆనందం వ్యక్తం చేశారు. స్కైరూట్ ఏరోస్పేస్, ఇక్కడే హైదరాబాద్‌లో జన్మించి, భారతదేశంలోనే ప్రైవేట్ రంగం ద్వారా రాకెట్ ప్రయోగాలు సాధ్యమని నిరూపించింది.

వారి విజయం కేవలం ఉత్పత్తి కాదు, ఒక కొత్త ఎకోసిస్టమ్‌ను సృష్టించింది: ప్రొపల్షన్ ఇంజనీర్లు, కాంపోజిట్ నిపుణులు, స్పేస్ సరఫరాదారులు అనే కొత్త తరాన్ని పెంచింది అని వివరించారు.

ధ్రువ స్పేస్, మరో హైదరాబాద్ ఆధారిత సంస్థ, ఉపగ్రహ రూపకల్పన నుండి తయారీ, ప్రయోగం, గ్రౌండ్ స్టేషన్‌ల వరకు సంపూర్ణ పరిష్కారాలను చూపుతుంది, మనం ప్రపంచ స్థాయి వ్యవస్థలను మన రాష్ట్రంలోనే రూపకల్పన చేయగలమని చూపిస్తోంది అని తెలిపారు.

ఇవన్నీ చుట్టూ రోబోటిక్స్, పదార్థ శాస్త్రం, 3D ప్రింటింగ్ రంగాల్లో కొత్తగా ఎదుగుతున్న సంస్థలు కలిసి భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థకు కొత్త రూపాన్ని ఇస్తున్నాయి అన్నారు. ఇవి ఒంటరిగా పని చేయడం లేదు. ఇవి హైదరాబాద్‌లోని IIT Hyderabad, IIIT Hyderabad, BITS Pilani, University of Hyderabad, T-Works వంటి సంస్థలతో బలమైన అనుసంధానం కలిగి ఉన్నాయి అని తెలిపారు. ఇదే తెలంగాణా మోడల్ ఆఫ్ ఇన్నోవేషన్, ప్రభుత్వ సంస్థలు పునాది వేస్తాయి, స్టార్టప్‌లు దానిపై నిర్మిస్తాయి, విశ్వవిద్యాలయాలు ప్రతిభను పెంపొందిస్తాయి అని వివరించారు. ఈరోజు హైదరాబాద్ భారతదేశంలోని అత్యంత విభిన్న సాంకేతిక ఎకోసిస్టమ్‌లలో ఒకటిగా నిలిచింది. IT, లైఫ్ సైన్సెస్, ఎల క్ట్రానిక్స్, రక్షణ, ఇప్పుడు అంతరిక్ష సాంకేతికతలో ప్రపంచ నాయకులకు ఆతిథ్యం ఇస్తోంది అన్నారు.

అదిబట్లలో ఏరోస్పేస్ మాన్యుఫాక్చరింగ్, ఈ–సిటీలో ఎలక్ట్రానిక్స్, జీనోమ్ వ్యాలీలో ఫార్మా, మరియు షంషాబాద్ సమీపంలోని మొబి లిటీ వ్యాలీలో రవాణా సాంకేతికతలు.





ప్రతి క్లస్టర్‌లో మూడు విలువలు ప్రధానంగా ఉంటాయి. ఆవిష్కరణ, తయారీ, సుస్థిరత అని వివరించారు. ISRO అనుబంధ సౌకర్యాలు, టెలీమెట్రీ కేంద్రాలు, ఇన్క్యుబేషన్ స్థలాలు హైదరాబాద్‌ను భవిష్యత్తు అంతరిక్ష మిషన్లకు ప్రధాన కేంద్రంగా నిలిపాయి అని డిప్యూటీ సీఎం తెలిపారు. అవి చంద్రయానం కావొచ్చు, భూమి పరిశీలన కావొచ్చు, లేదా అంతరిక్ష వనరుల వినియోగం కావొచ్చు అన్నారు. ఈ కాన్ఫరెన్స్ థీమ్"బయోఇన్స్పైర్డ్ ఫ్రాంటియర్స్"మనకు ఒక లోతైన విషయం గుర్తు చేస్తుంది: ప్రకృతే అసలు ఇంజనీర్ అని డిప్యూటీ సీఎం విశ్లేషించారు.

అత్యంత అందమైన రెక్కలు, కవచాలు, న్యూరల్ నెట్వర్క్లు వంటివి ప్రకృతిలో ఇమిడి ఉన్నాయి అన్నారు. మన కర్తవ్యం ప్రకృతిని మించి పోవడం కాదు, దానినుంచి నేర్చుకోవడం అని వివరించారు.

తెలంగాణా ప్రభుత్వం ఈ తత్త్వాన్ని తన అభివృద్ధి దృక్పథంలో భాగం చేస్తోంది, బయోమిమెటిక్ డిజైన్, గ్రీన్ బిల్డింగ్ కోడ్స్, నీటి నిర్వహణ, శుద్ధ ఇంధనం రంగాల్లో దీన్ని ప్రోత్సహిస్తోంది అని వివరించారు.

అంతరిక్షంలోకి విస్తరించేప్పుడు కూడా మనం ఈ వినయాన్ని తీసుకెళ్లాలి, ఆవిష్కరణ, సంరక్షణ రెండూ కలిసి రెండు కాళ్ళ మాదిరిగా నడవాలి అన్నారు. భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ రాబోయే దశాబ్దంలో విపరీతంగా పెరగబోతోంది. ఆ వృద్ధికి తెలంగాణా లాంచ్‌ప్యాడ్‌గా ఉండాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది అన్నారు.

ప్రపంచంలోని పరిశోధనా సంస్థలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలను హైదరాబాద్‌కి ఆహ్వానిస్తున్నాము అన్నారు. సహాయక విధాన వాతావరణం, ఇన్క్యుబేషన్ సపోర్ట్, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు అందించడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది అన్నారు.

హైదరాబాద్ ఈరోజు కేవలం ఒక గమ్యం కాదు, ఒక మనస్తత్వం: విచారణాత్మకమైనది, ఆత్మవిశ్వాసంతో కూడినది అన్నారు. ఈరోజు ఇక్కడ మొదలైన చర్చలు భవిష్యత్తులో భూమి మీదా, అంతరిక్షంలోనూ మంచిని నిర్మించే భాగస్వామ్యాలుగా మారాలని కోరుకుంటున్నాను అన్నారు. తెలంగాణ ఎల్లప్పుడూ ప్రభుత్వ సంస్థలను ప్రేరేపించే, స్టార్టప్‌లు ఆవిష్కరించే, ప్రపంచ శాస్త్రం కలిసే ప్రదేశంగా ఉంటుందని స్పష్టం చేశారు.

జ్ఞానం మరియు అన్వేషణ మధ్య వంతెనగా, భూమి మరియు ఆకాశం మధ్య సేతువుగా హైదరాబాద్ మహానగరం ఎప్పటికీ నిలవాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు. సమావేశంలో ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్, GEOPAQ సీఈవో ఎం అబ్బాస్, లీడ్ స్పాన్సర్ సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

# జి+1 తరహాలో ఇందిరమ్మ ఇండ్లు

- మారనున్న మురికి వాడల రూపురేఖలు
- పట్టణ ప్రాంత పేదలకు శుభవార్త
- రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్,(అక్షర గళం):పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం గ్రామీణ ప్రాంతాలలో శర వేగంగా సాగుతున్న నేపథ్యంలో పట్టణ ప్రాంతాలలో కూడా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై దృష్టి సారించామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పై బుధవారం నాడు మంత్రిగారు సచివాలయం లోని తన కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో ఇరుకు స్థలాల్లో నివసిస్తున్న పేద ప్రజలకు పక్కా ఇంటి వసతిని కల్పించేలా ఇందిరమ్మ పథకాన్ని వర్తింప చేస్తున్నామని అన్నారు.కనీసం 30 చదరపు మీటర్ల విస్తీర్ణంలో జి ప్లస్ 1 తరహాలో ఇంటిని నిర్మించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని వెల్లడించారు. గ్రౌండ్ ఫ్లోర్లో 200 చదరపు అడుగులు మొదటి అంతస్తులో మరో 200 చదరపు అడుగులు నిర్మించుకునేలా ఈ మేరకు జీవో ఎంస్ నె 69 ద్వారా ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు.

పట్టణ ప్రాంతాల్లో పేదలకు పక్కా ఇంటి వసతిని కల్పించాలన్న లక్ష్యంతో పాటు, స్థలాల కొరత ను దృష్టిలో ఉంచుకుని కొన్ని సడలింపులు ఇచ్చామని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లోని పేదలకు పక్కా ఇంటి వసతి కోసం కొద్ది కాలంగా పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై అధ్యయనం చేశామని తెలిపారు. రాష్ట్రంలోని అనేక పట్టణాలు, నగరాల్లోని పేదలు సొంత ఇంటిని నిర్మించుకోడానికి తగిన స్థలం లేక, అరకొర వసతులతో తాత్కాలిక ఏర్పాట్లు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని అటువంటి వారి కోసం ఇందిరమ్మ ఇండ్ల ను నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు.

అనేక మంది 60 చదరపు గజాల కంటే తక్కువ విస్తీర్ణంలోని రేకుల షెడ్లు, ఇతరత్రా తాత్కాలిక ఏర్పాట్లుతో జీవిస్తున్నారు. వీరికి ఆర్ సిసి స్లాబుతో పక్కా ఇంటిని నిర్మించాలంటే తగిన స్థలం అందుబాటులో లేదు. ఈ సమస్యను అధిగమించడానికి పట్టణ ప్రాంతాల్లో జి ప్లస్ 1 నిర్మాణాలకు అనుమతినిస్తూ, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అందచేస్తున్న రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని దశల వారీగా నిర్మాణపు పనుల స్థాయిని



బట్టి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.

### పట్టణ ప్రాంతాల్లో ఇంటి నిర్మాణం ఎలా ఉండాలంటే....

జి౦1 విధానంలో పట్టణ ప్రాంతాల్లోని లబ్ధిదారులు 96 చదరపు అడుగుల విస్తీర్ణంలో, 70 అడుగుల విస్తీర్ణంలో వేర్వేరుగా రెండు గదులతో పాటు, కనీసం 35.5 చదరపు అడుగుల్లో వంటగదిని నిర్మించుకోవాలి, ప్రతి ఇంటికి ప్రత్యేకంగా టాయిలెట్, బాత్ రూంలు తప్పనిసరిగా ఉండాలని, ఈ ఇంటి నిర్మాణం ఆర్ సిసి స్లాబ్ తో ఉండాలని, ఇందుకు సంబంధించిన స్ట్రక్చరల్ డిజైన్లకు డిఇఇ (హౌసింగ్)అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు.

### నాలుగు దశల్లో రూ.5 లక్షలు చెల్లింపు...

మొదటి అంతస్తు – రూఫ్ లెవల్ వరకు నిర్మాణం అయితే రూ. 1 లక్ష , అటు తరువాత గ్రౌండ్ ఫ్లోర్ – రూఫ్ వేసిన తరువాత రూ.1 లక్ష, ఆపైన ఫస్ట్ ఫ్లోర్ లో కాలమ్స్, స్లాబ్, గోడల నిర్మాణాలు పూర్తి అయిన పిదప రూ.2 లక్షలను, ఇంటి నిర్మాణపు పూర్తి అయిన తరువాత మరో లక్ష రూపాయలను విడుదల చేస్తామన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా పేదవాళ్ల ఇంటికోసం ఐదు లక్షల రూపాయిలు ఖర్చు చేయడం లేదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఒక ఎత్తు అయితే, పట్టణ ప్రాంతాల్లో మరో ఎత్తు అని, ఇది ప్రభుత్వానికి ఒక సవాల్ అని దీనిని దృష్టిలో ఉంచుకుని, పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై ప్రధానంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

# తెలంగాణలో 'ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ సిటీ'

### విదేశీ వర్సిటీల కోసం 'ప్లగ్ అండ్ ప్లే' క్యాంపస్
### రాష్ట్రంలో ఏర్పాటుకు ఆస్ట్రేలియా విద్యాసంస్థ 'వీఐటీ' ఆసక్తి
### ఆస్ట్రేలియా పర్యటనలో మంత్రి శ్రీధర్ బాబుతో ప్రత్యేక భేటీ

హైదరాబాద్,అక్టోబర్22 (అక్షర గళం):

తెలంగాణలో 'ప్లగ్ అండ్ ప్లే' విధానంలో 'ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ సిటీ'ని ఏర్పాటు చేసేందుకు ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ విద్యా సంస్థ విక్టోరియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(వీఐటీ) ఆసక్తి చూపిస్తోంది.

ఈ మేరకు ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మెల్ బోర్న్ లో బుధవారం వీఐటీ బోర్డు సభ్యుడు, మాజీ పార్లమెంటేరియన్, ప్రస్తుత ఆస్ట్రేలియా ప్రధాని సన్నిహితుడు అలన్ గ్రిఫిన్ ప్రత్యేకంగా కలిశారు.

అంతర్జాతీయ విద్యా, నైపుణ్య కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున తీసుకుంటున్న చర్యలు, ఇక్కడి అనుకూలతలు, ప్రగతిశీల విధానాలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, తెలంగాణ యువత ప్రతిభ, సమర్థవంతమైన నాయకత్వం తదితర అంశాలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వారికి వివరించారు.

అనంతరం 'ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ సిటీ' ఏర్పాటు ప్రతిపాదనపై సుదీర్ఘంగా చర్చించారు. విదేశీ వర్సిటీలు, ఉన్నతస్థాయి పరిశోధన



కేంద్రాలు, నైపుణ్యాభివృద్ధి సంస్థలకు 'గ్లోబల్ హబ్' గా ఈ క్యాంపస్ ను అభివృద్ధి చేస్తామని 'విట్' ప్రతినిధులు మంత్రి శ్రీధర్ బాబుకు చెప్పారు. సదరు సంస్థలు తమ కార్యకలాపాలను నిర్వహించుకునేలా 'ప్లగ్ అండ్ ప్లే' విధానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక సదుపాయాలతో ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

ఈ ప్రతిపాదనపై మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు. స్థల పరిశీలన, తదుపరి చర్చల కోసం తెలంగాణకు రావాలని ఆహ్వానించారు. సమావేశంలో వీఐటీ ప్రతినిధి అర్జున్ సూరపనేని, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# సకాలంలో మేడారం మహాజాతర ఏర్పాట్లు

### అధికారులతో సమీక్షించిన గిరిజన శాఖ కార్యదర్శి

హైదరాబాద్,అక్టోబర్22 (అక్షర గళం):

మేడారం మహాజాతర ఏర్పాట్లపై సచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మేడారం జాతరకి గిరిజన సంక్షేమ శాఖ రూ. 150.00 కోట్లు మంజూరు చేయగా అందులో రూ. 90.00 కోట్లు సివిల్ వర్క్స్ కు, రూ. 60.00 నాన్ సివిల్ వర్క్స్ కు ఉద్దేశించారు. ఈ సమావేశంలో సివిల్ వర్క్స్ స్టేటస్, నాన్ సివిల్ వర్క్స్ యాక్షన్ ఎ÷–లాన్ మీద సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సబ్యసాచి ఘోష్ ములుగు జిల్లా కలెక్టర్ శ్రీ దివాకర్ గారితో కలిసి మాట్లాడుతూ మేడారం జాతర ఏర్పాట్లను మొత్తం 8 జోన్లు, 31 సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు. జోన్3 జంపన్న వాగు ప్రాంతంగా నిర్ణయించబడింది. జాతర సమయంలో 10 నుండి 12 వేలమంది పోలీసు సిబ్బంది విధుల్లో పాల్గొననున్నారు. ప్రతి జోన్‌కు ఒక జోనల్ ఆఫీసర్ను నియమించనున్నారు.24 శాశ్వత టవర్స్, 20 సెల్–ఆన్–వీల్స్, 350 వై–ఫై పాయింట్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.కోర్ రూట్లు మరియు పార్కింగ్ ప్రదేశాలను గుర్తించారు. మొత్తం 49 పార్కింగ్ ప్రదేశాలు (1050 ఎకరాలు) గుర్తించబడి, దాదాపు 4.5 నుండి 6 లక్షల వాహనాలు నిలిపే సదుపాయం కల్పించబడుతుంది. ఏర్పాట్లు నవంబర్ 30 నాటికి పూర్తవుతాయని తెలిపారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో కచ్చా నుండి డబుల్ లేన్ రూపంలో అభివృద్ధి చేస్తున్నారు. వీటిలో భాగంగా వైల్డ్‌లైఫ్ శాంక్చువరీలోని రహదారులు కూడా చేర్చబడ్డాయి. ఆర్ / బీ శాఖ ద్వారా 42 కోట్లతో ఆలయం చుట్టూ రహదారులు, మరియు 92 కోట్లతో ప్రధాన రహదారులు నిర్మించబడుతున్నాయి. జాతర సమయానికి ముందు, మధ్య మరియు తరువాత ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ప్రత్యేక జాతర సందర్శనలు చేపట్టనున్నట్లు తెలిపారు.జంపన్న వాగు వద్ద తాత్కాలిక రహదారి కూలిపోయిన కారణంగా మరమ్మత్తు పనులు వేగంగా జరుగుతున్నాయి. 517 బోరుపాయింట్లు/నీటి వనరులు, 250 కిలోమీటర్ల రహదారులపై లైటింగ్ పనులు జరుగుతున్నాయి. స్థానికుల సహకారంతో 6 స్లాటర్ సెంటర్లు ఏర్పాటు చేయబడ్డాయి. జంపన్న వాగు



పునరుద్ధరణ పనులు సాగిస్తున్నట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు.9,111 విద్యుత్ స్తంభాలు, 259 ట్రాన్స్ఫార్మర్లు అమర్చే పనులు విద్యుత్ శాఖ చేపట్టింది. జాతర ప్రాంతమంతా ఎండోమ్మెంట్స్ శాఖ ఆధ్వర్యంలో ప్రకాశ ఏర్పాట్లు (ఇల్యూమినేషన్) చేయనున్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మేడారం సమ్మక్క?సారలమ్మ జాతర విజయవంతంగా జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని శ్రీ సబ్యసాచి ఘోష్ ఆదేశించారు. మావేశంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీ శ్రీ మహేష్ భగత్, ములుగు, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, ములుగు ఎస్పీ, ఇతర సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com అక్షరగళం ప్రతి అక్షరం ప్రజల కోసం



# వేసవిలో శక్తినిచ్చే డ్రింక్స్

ఎండతాపాన్ని తట్టుకోవడానికి, నీరసం రాకుండా ఉండటానికి, ఒళ్లు నొప్పులు రాకుండా, దాహాన్ని కంట్రోల్ చేయడానికి ఐదు జ్యూస్‌లున్నాయి. వాటిని ప్రతిరోజూ తీసుకుంటే, జీర్ణకోశం శుభ్రపడి ఆరోగ్యంగా ఉంటారు. వాటిని ఎలా తయారుచేయాలంటే...

* సగం యాపిల్, కొద్దిగా కొత్తిమీర, అర కీరదోస, ఒక టీ స్పూను నిమ్మరసం, చిటికెడు ఉప్పు, చిటికెడు పంచదార, నాలుగు ఐస్‌క్యూబ్స్, ఒక గ్లాసు చల్లటి నీరు... వీటన్నింటినీ కలిపి మిక్సర్‌లో బ్లెండ్ చేసి రాత్రి నిద్రపోయే ముందు తాగాలి.
* సగం యాపిల్, పది పాలకూర ఆకులు, ఒక టీ స్పూను నిమ్మ రసం, ఒక టీ స్పూను పంచదార, చిటికెడు ఉప్పు, నాలుగు ఐస్ క్యూబ్స్, ఒక గ్లాసు చల్లటి నీరు... వీటిని మిక్సర్‌లో బ్లెండ్ చేసి సాయంకాలం తాగాలి.



* అర కప్పు పెరుగు, చిన్న అల్లం ముక్క, ఒక టీ స్పూను నిమ్మరసం, చిటికెడు దంచిన పచ్చిమిర్చి, తగినంత ఉప్పు, నాలుగు ఐస్‌క్యూబ్స్, ఒక గ్లాసు చల్లటి నీరు... అన్నీ కలిపి మిక్సర్‌లో బ్లెండ్ చేసి, మట్టి గ్లాసులో పోసి మధ్యాహ్నం తాగాలి.
* ఒక గ్లాసు కొబ్బరి బోండాం నీళ్లు, బోండాలో ఉండే కొబ్బరి మీగడ, చిటికెడు పంచదార, చిటికెడు ఉప్పు, నాలుగు ఐస్‌క్యూబ్స్... అన్నీ కలిపి మిక్సర్‌లో బ్లెండ్ చేసి ఉదయం 11 గంటలకు తాగితే బూస్టర్ డోస్‌లా పనిచేస్తుంది.
* పావు కప్పు క్యారెట్, అర కప్పు ఆరెంజ్ జ్యూస్, పావు కప్పు యాపిల్, పావు కప్పు బీట్‌రూట్, చిటికెడు ఉప్పు, చిటికెడు పంచదార, నాలుగు ఐస్‌క్యూబ్స్, ఒక గ్లాసు చల్లటి నీళ్లు... అన్నీ కలిపి మిక్సర్‌లో బ్లెండ్ చేసి ఉదయం బ్రేక్ ఫాస్ట్‌తో పాటు తీసుకోవాలి. వేసవిలో ప్రతీ రోజూ వీటిని తాగితే ఎండదెబ్బ బారిన పడకుండా, నీరసపడిపోకుండా హాయిగా ఉండొచ్చు.

# మానసిక ఆరోగ్యం కోసం..

టీనేజ్‌లో దృఢమైన స్నేహాలు ఉన్న పిల్లల మానసిక ఆరోగ్యం ఎంతో బాగుంటుందట. వారికి యాంగ్జయిటీ, డిప్రెషన్ వంటి మానసిక జబ్బులు దరిచేరవట. అంతేకాదు సోషల్ యాక్సెప్టెన్సీ, స్వీయ అంగీకారం వంటి సద్గుణాలు కూడా వారిలో బాగా ఉంటాయట. అందుకే పిల్లలు నలుగురితో కలివిడిగా ఉండడం, స్నేహాలు పెంపొందించుకోవడాన్ని తల్లితండ్రులు ప్రోత్సహించాలంటున్నారు అధ్యయనకారులు. యుక్తవయసులో వారు పెంపొందించుకున్న సన్నిహిత స్నేహాలు వారిని మానసికంగా దృఢంగా తయారుచేస్తాయట. పిల్లలకున్న స్నేహితులను బట్టి దీర్ఘకాలంలో వారి మానసిక, శారీరక ఆరోగ్యాలను సైతం కనిపెట్టవచ్చని వైద్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు. మంచి స్నేహాలున్న హైస్కూలు విద్యార్థులు మానసికపరమైన వివిధ అంశాల్లో ఎంతో మెరుగుదలను ప్రదర్శిస్తారట. కానీ స్కూలు రోజుల్లో తమ ఫ్రెండ్స్ సర్కిల్‌కే పరిమితమైన వారు భవిష్యత్తులో తీవ్రమైన సోషల్ యాంగ్జయిటీకి గురయ్యే అవకాశాలు బాగా ఉన్నాయట.



15 నుంచి 25 సంవత్సరాల వయసులో ఉన్న 169మంది యువతీయువకుల మీద పది సంవత్సరాల పాటు ఈ స్టడీని కొనసాగించారు. ప్రతి సంవత్సరం వీళ్లని పరీక్షించారు. రకరకాలుగా వారి మానసిక ఆరోగ్యాన్ని అంచనా వేశారు. అలా 25 ఏళ్లల్లో యువతీయువకుల్లో పెరిగిన యాంగ్జయిటీ, సోషల్ యాక్సెప్టెన్సీ, స్వయం అంగీకారం, ఒత్తిడి లక్షణాల తీవ్రతను పరిశీలించారు. యుక్తవయసులో స్నేహాలు లేని వారిలో తక్కువ కాలంలోనే మార్పులు తలెత్తడాన్ని కూడా పరిశోధకులు గమనించారు. తల్లితండ్రులు తమ పిల్లలు మంచి స్నేహాలు చేసేలా ప్రోత్సహించి వారు మానసికంగా ఆరోగ్యంగా ఉండేలా చూడాలని అధ్యయనకారులు సూచిస్తున్నారు.

# కుంగిపో వద్దమ్మా!

గర్భం దాల్చింది మొదలు, తొమ్మిది నెలలు మోసి, పండంటి బిడ్డను ప్రసవించేవరకూ... ప్రతి క్షణాన్నీ, మాతృత్వపు మధురిమల్నీ మనసారా ఆస్వాదిస్తారు మహిళలు. అయితే అరుదుగా కొందరిలో ఆనందానికి బదులు అంతులేని నిరాశానిస్పృహలు అలుముకుంటాయి. మానసికంగా కుంగిపోతారు. బిడ్డ పోషణ గురించిన ఆసక్తి ఉండదు. అర్థం కాని, అర్థం లేని భయాలు, అనుమానాలు చెలరేగుతాయి. కొన్నిసార్లు ఆత్మహత్యలకూ తెగబడతారు. ఈ స్థితే... 'పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్'!



ఇది కొంత ఆశ్చర్యంగా అనిపించవచ్చు. ఇలా కూడా ఉంటుందా? అని అనిపించవచ్చు. కానీ గర్భిణి లేదా బాలింత డిప్రెషన్‌కు లోనవడం సర్వసాధారణం. ఇందుకు మానసిక కారణాలు ఉండొచ్చు. మానసిక రుగ్మతల పూర్వ చరిత్ర ఉండి ఉండవచ్చు. ప్రసవంతో హార్మోన్ల స్రావాలు హఠాత్తుగా తగ్గడం వల్ల కూడా ఈ పరిస్థితి తలెత్తవచ్చు. విపరీతమైన ఒత్తిడి వల్ల కూడా ఇలా జరగవచ్చు. ఉదాహరణకు.....

అప్పటిదాకా సాధారణ ప్రసవమే జరుగుతుందని అనుకున్నా, ఊహించని కారణాల వల్ల సి సెక్షన్ జరిగినప్పుడు

ప్రసవ సమయంలో ఇబ్బందులు తలెత్తినప్పుడు

భర్త, కుటుంబీకుల తోడ్పాటు లోపించినప్పుడు

ప్రసవం గురించి విపరీతమైన భయాలు ఉన్నప్పుడు

చెప్పుడు మాటలు విని పెంచుకున్న అపోహల వల్ల

చనుబాలు రాకపోయినా

న్యూక్లియర్ ఫ్యామిలీ (భార్య, భర్త తప్ప ఇతరులు ఎవరూ లేని కుటుంబం)

ఇలా.. కారణం ఏదైనా నిరాశకు లోనవుతున్నట్టు అనిపించినా, ఆ లక్షణాలను కుటుంబసభ్యులు గమనించినా వెంటనే వైద్యులను సంప్రతించాలి. 'అలా అనిపించడం మామూలేలే! మేమంతా పిల్లల్ని కన్నవాళ్లమేగా?' అంటూ తేలికగా తీసిపారేయకుండా వెంటనే అప్రమత్తమవడం మంచిది. డిప్రెషన్ ప్రసవం తర్వాతే కాదు, ముందూ రావచ్చు. ప్రసవమై బిడ్డకు 4 నెలల నుంచి ఏడాది వయసొచ్చేవరకూ కొనసాగవచ్చు. ఇది వ్యక్తికీ వ్యక్తికీ, వేర్వేరుగా ఉంటుంది.

### లక్షణాలు సుస్పష్టం!

అకారణంగా ఏడుపు రావడం, కోపం, చీకాకు, నీరసం

నిద్ర పట్టకపోవడం, బిడ్డకు ఎవరైనా హాని తలపెడతారేమోననే భయం, రాత్రుళ్లు మేలుకుని ఉండడం

తమకు తాము లేదా బిడ్డకు హాని తలపెట్టాలనే ఆలోచనలు కలగడం, బిడ్డ మీద అనిష్టం, బిడ్డకు పాలివ్వకపోవడం

ఆత్మహత్య ఆలోచనలు

### తీవ్రత ఎవరిలో ఎక్కువంటే?

సాధారణ మహిళలతో పోలిస్తే, చిన్నప్పటి నుంచీ డిప్రెషన్‌కు లోనవుతున్నవారు, భర్త ప్రేమను పొందలేనివారు, గతంలో ప్రసవ సమయంలో డిప్రెషన్‌కు లోనయినవాళ్లు తప్పనిసరిగా గర్భం దాల్చిన తొలినాళ్లలోనే డిప్రెషన్ బారిన పడుతూ ఉంటారు. వీరిలో గర్భం దాల్చామనే ఆనందం మచ్చుకైనా కనిపించదు. తీవ్రమైన భావోద్వేగాలను వ్యక్తపరుస్తూ ఉంటారు. కొందరికి ప్రసవం ముందువరకూ లేని డిప్రెషన్ తర్వాతి ఏడు రోజులూ తీవ్రంగా ఉంటుంది. ఆ సమయంలో పిల్లలను దగ్గరకు తీసుకోరు. వాళ్లకు పాలివ్వడానికి ఇష్టపడరు. ఆ ఏడు రోజులూ దాటితే ఈ మహిళలు తిరిగి మామూలుగా మారిపోతారు. ఇంకొందరిలో ప్రసవమైన 4వ నెలలో పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్ తీవ్రత పెరుగుతుంది. పిల్లల పెంపకం వారిలో ఒత్తిడిని పెంచుతుంది. ఇలా మొదటిసారి తల్లిగా మారిన మహిళల్లో ఎక్కువ.

### వైద్యుల దృష్టికి తీసుకెళ్లాలి

మహిళలు తమకున్న నిరాశానిస్పృహలను వ్యక్తం చేయడానికి ఇష్టపడరు. కానీ ఇలాంటి భావనలను నిర్లక్ష్యం చేయకూడదు. దానంతట అదే తగ్గిపోతుందిలే! అనే నిర్లక్ష ధోరణీ తగదు. అకారణంగా, ఏమాత్రం మనసు బాధగా అనిపిస్తున్నా, ఊరికే ఏడుపొస్తున్నా, తిండి మీద ఆసక్తి తగ్గినా, నిద్ర పట్టకపోతున్నా వెంటనే గైనకాలజిస్టును కలిసి పరిస్థితి వివరించాలి. ఒకవేళ గతంలో డిప్రెషన్ బారిన పడి ఉంటే ఆ విషయాన్నీ వైద్యుల దృష్టికి తీసుకెళ్లాలి. ఏ మందులు వాడుతున్నదీ చెప్పాలి. ప్రసవం తర్వాత ఏడు రోజుల్లో ఇవే లక్షణాలు మొదటిసారి కనిపించినా అశ్రద్ధ చేయకూడదు. గతంలో ప్రసవానికి ముందుగానీ, తర్వాతగానీ ఈ లక్షణాలు ఎదుర్కొన్న మహిళలు గర్భం దాల్చిన వెంటనే ఈ విషయాన్ని వైద్యుల దృష్టికి తీసుకెళ్లాలి.



### నిర్లక్ష్యం చేస్తే?

డిప్రెషన్ కొంతమందిలో విపరీతమైన ప్రవర్తనకు దారి తీస్తుంది. తమకు తాము హాని తలపెట్టుకుంటారు, లేదా బిడ్డకు హాని తలపెడతారు. ఇంకొందరు మహిళలు భర్తలనూ వదలరు. ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలూ వాళ్లను వేధిస్తాయి. తమకున్నది తాత్కాలిక మానసిక అసమతౌల్యం అని గ్రహించలేక, తీవ్రమైన చర్యలకు పాల్పడుతూ ఉంటారు. కుటుంబ సభ్యులకూ అవగాహన లేక వారి ప్రవర్తనను తప్పుబడుతూ ఉంటారే తప్ప ఆరోగ్య సమస్యగా భావించి, వైద్యుల దగ్గరకు తీసుకెళ్లరు. నిజానికి గర్భిణిగా లేదా బాలింతగా ఉన్న సమయంలో నిరాశా నిస్పృహలు తలెత్తడం కొంత సహజమే! దాదాపు 50% మంది మహిళలు ఈ ఇబ్బందిని తప్పక ఎదుర్కొంటూ ఉంటారు. కొందరు దృఢమైన మనస్తత్వం కలిగినవారు మౌనంగా భరించగలుగుతారు. మరికొందరు బలహీనులు దీని బారినపడి ఏకంగా ప్రాణాలు కోల్పోయి కన్న బిడ్డలను అనాథలుగా మిగులుస్తూ ఉంటారు. డిప్రెషన్... ఆ మహిళకే కాకుండా పుట్టిన బిడ్డకూ హానికరమే! ఈ సమస్యను చికిత్సతో నయం చేయకపోతే, వారికి పుట్టిన పిల్లలు పెరిగి పెద్దయ్యాక 'అటెన్షన్ డెఫిసిట్ హైపరాక్టివ్ డిజార్డర్'కి గురవుతారు. ఈ పిల్లలు ఎక్కడా నిలకడగా కూర్చోకుండా విపరీతమైన ప్రవర్తన కలిగి ఉంటారు.

### కంగారు పడవద్దు!

మొదటిసారిగా గర్భం దాల్చిన మహిళల మీద చెప్పుడు మాటల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అలాగే చిన్నప్పటి నుంచీ ఏర్పరుచుకున్న అపోహలు కూడా ఎక్కువ ప్రభావాన్నే చూపిస్తాయి. ప్రసవం గురించి, ఆ సమయంలో కలిగే నొప్పి గురించీ పెద్దలు చెప్పే మాటలు మహిళల్లో తెలియని భయాన్ని నింపుతాయి. దాని వల్ల కూడా గర్భిణుల్లో డిప్రెషన్ తలెత్తవచ్చు. తొలి ప్రసవమైతే, ప్రసవం తర్వాత రెండు మూడు రోజులపాటు తల్లి రొమ్ముల నుంచి నీరు లాంటి ద్రవమే కారుతుందిగానీ, పాలు రావు. ఇది చూసి 'నీకు పాలు రావేమో! ఇక నీ బిడ్డకు పోత పాలే పట్టించాలేమో?' అని ఇరుగుపొరుగూ అంటే అది తప్పు. తొలి ప్రసవం జరిగినప్పుడు ఈ లక్షణాలు సహజం. మూడు రోజుల తర్వాత పాలు తప్పకుండా వస్తాయి. కంగారు పడవలసిన అవసరం లేదు. బిడ్డకు పాలు సరిపోతాయి కూడా! ఒకవేళ నాలుగు నెలల తర్వాత పోతపాలు పట్టించే పరిస్థితి వచ్చినా కంగారు పడకూడదు.

గర్భం, ప్రసవం తాలూకు మధురిమలకు అడ్డుగోడగా నిలిచే డిప్రెషన్‌ను పారదోలడం పూర్తిగా మహిళల చేతుల్లోనే ఉంది. లక్షణాల ఆధారంగా పరిస్థితిని గ్రహించి వైద్యుల దృష్టికి తీసుకెళ్లి సమర్థమైన చికిత్స తీసుకోవాలి. అన్నిటికంటే ముఖ్యంగా మహిళలతో పాటు వారి కుటుంబసభ్యులు కూడా అవగాహన ఏర్పరుచుకోవాలి.

### బిడ్డ మీద ప్రభావం తక్కువే!

గర్భిణులకు ఇచ్చే మందుల ప్రభావం ఎంతో కొంత గర్భస్థ శిశువుల మీద, పుట్టిన పసికందుల మీద ఉంటుంది. అయితే తల్లి క్షేమం ప్రధానం కాబట్టి మందులు ఇవ్వక తప్పదు. ఇక పాలిచ్చే తల్లుల పాల ద్వారా పసికందులకు అందే మందుల ప్రభావం కంటే చనుబాల ద్వారా అందే పోషకాలు విలువైనవి. కాబట్టి బిడ్డకు పాలు పట్టించడం మానకూడదు. ఇక సైకోటిక్ దశకు చేరుకున్న తల్లులు బిడ్డలకు పాలిచ్చే పరిస్థితిలో కూడా ఉండరు కాబట్టి భయపడవలసిన అవసరం లేదు.

### చికిత్సలున్నాయి!

ప్రసవం ముందైనా, తర్వాతైనా డిప్రెషన్ తాలూకు లక్షణాలు కనిపిస్తే మొదట కౌన్సెలింగ్ ఇవ్వవలసి ఉంటుంది. వారి మెడికల్ హిస్టరీ ఆధారంగా డిప్రెషన్ గురించి లోతైన అవగాహన ఏర్పరుచుకుని, తదనుగుణంగా చికిత్సను సూచిస్తాం! ప్రారంభంలో కౌన్సెలింగ్ ఉంటుంది. దీంతో చాలావరకూ లో ఫీలింగ్, పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్‌లు తగ్గుముఖం పడతాయి. ఒకవేళ అప్పటికీ తగ్గకపోతే యాంటీ డిప్రెసెంట్లు ఇవ్వవలసి ఉంటుంది. వీటితో కూడా అదుపు కాకుండా సైకోటిక్ దశకు చేరుకుంటే ఆ సమస్యకు తగిన చికిత్స ఇవ్వవలసి ఉంటుంది. ఏదేమైనా గర్భిణుల్లో, బాలింతల్లో ఈ భావోద్వేగాలను అలక్ష్యం చేయకూడదు. లక్షణాలు కనిపించిన వెంటనే కుటుంబసభ్యులే చొరవ తీసుకుని వైద్యుల దగ్గరకు తీసుకెళ్లాలి. కొందరికి కొన్ని నెలలపాటు చికిత్స చేస్తే డిప్రెషన్ పూర్తిగా పోతుంది. కొందరికి అరుదుగా జీవితాంతం మందులు వాడవలసి రావొచ్చు.

# స్మార్ట్‌గా.. ఫిట్‌గా!

**శరీరంలో చేరిన అనవసరమైన కొవ్వును కరిగించడానికి ఆండ్రాయిడ్, ఓఎస్ వెర్షన్లలో అందుబాటులో ఉన్న ఫిట్‌నెస్ యాప్స్ విశేషాలివి...**

### సెవెన్ మినిట్ వర్కవుట్

ఆరోగ్యంగా ఉండాలంటే శరీరానికి వ్యాయామం ఎంతో అవసరం. ఈ బిజీ షెడ్యూల్‌లో వ్యాయామానికి ఖాళీ ఎక్కడిది అని ప్రశ్నించే వాళ్లూ ఉంటారు. అలాంటి వాళ్ల కోసమే ఈ యాప్. కనీసం ఉదయం ఏడు నిమిషాలు కేటాయిస్తే చాలు... మిమ్మల్ని ఫిట్ చేయడానికి ఓ యాప్ రెడీగా ఉంది. అదే 'సెవెన్ మినిట్ వర్కవుట్'. ఇందులో వర్కవుట్ ఎలా చేయాలో అన్ని వివరాలతో పాటు డెమో వీడియోలూ ఉంటాయి.




### స్కాట్స్

వ్యాయామం చేస్తున్నారు సరే... ఎలాంటి డైట్ తీసుకోవాలి? డైట్ గురించి తెలియకపోతే కసరత్తులకు ఫలితం ఉండదు. దీనికోసం 'స్క్వాట్స్' అనే యాప్ ఉంది. ఇందులోకి లాగిన్ అయి ఆరోగ్య సమాచారాన్ని నమోదు చేస్తే దానికి తగ్గ ఫిట్‌నెస్ ప్లాన్‌ను చెబుతుందీ యాప్.

### మై ఫిట్‌నెస్ పాల్

ఎటువంటి ఆహారం తింటే ఎన్ని క్యాలరీలు శరీరంలోకి వెళతాయో, ఏ వ్యాయామం చేస్తే అవి ఖర్చవుతాయో తెలియాలంటే మీ ఫోన్‌లో ఫిట్‌నెస్ పాల్ ఉండాల్సిందే. అంతే కాదు మీరు కొన్న ఆహారం ప్యాకెట్ మీద ఉన్న బార్‌కోడ్‌ను స్కాన్ చేస్తే చాలు...కార్బోహైడ్రేట్స్, ప్రొటీన్లు, కొవ్వు శాతాలు ఆ ఆహారంలో ఎంత ఉన్నాయో చెబుతుంది.

### ట్రైఫెక్టా

క్రాస్‌ఫిట్ ట్రైనింగ్ తీసుకునేవారికి ఈ యాప్ బెస్ట్ ఆప్షన్. క్రాస్‌ఫిట్ ట్రైనింగ్‌కీ, సాధారణ వ్యాయామానికి చాలా తేడా ఉంటుంది. ఈ మధ్యకాలంలో ఈ తరహా శిక్షణకు ఎంతో డిమాండ్ పెరుగుతోంది.

# వారానికోరోజు మజ్జిగ చాలు

ఇంట్లో పేరుకొనే చెత్తను ఎప్పటికప్పుడు తీసేస్తాం. మరి మన శరీరంలో పేరుకొనే మలినాలు. వాటినీ తొలగించాలి లేదంటే అనారోగ్యాలు దాడిచేస్తాయి. వాటిని ఎప్పటికప్పుడు తొలగించడమే కాదు... అవి పేరుకోకుండా కూడా జాగ్రత్తపడాలి. అందుకు ఆయుర్వేద పరంగా ఏం చేయాలో చూద్దామా...

శరీరంలో అనేక రసాయన చర్యలు జరుగుతాయి. వాటిలో భాగంగానే కొన్ని మలినాలు శరీరం నుంచి విడుదలవుతూ ఉంటాయి. ఆహారం జీర్ణమయ్యాక, శ్వాస తీసుకునేటప్పుడు, కండరాల కదలిక... ఇలా ప్రతీ చర్యలోనూ మలినాలు విడుదలవుతూనే ఉంటాయి. ఇవి మలం, మూత్రం, నిశ్వాస, చెమట రూపంలో బయటికి వెళ్లిపోయేలా మన శరీరంలో ఏర్పాట్లున్నాయి. ఇవన్నీ సక్రమంగా జరిగి, శరీరంలో మలినాలు పేరుకోకుండా ఉంటేనే అనారోగ్యాలు దరిచేరవు.

శరీరంలో పేరుకునే రోగకారకాలను టాక్సిన్లు (ఆమం) అంటారు. ఇవి శరీరంలో పేరు కోకుండా ఉండటానికి, అలాగే పేరుకున్న వాటిని బయటికి పంపడానికి పలు పద్ధతులను ఉపయోగించవచ్చు. వాటినే 'లంఘన చికిత్సలు' అంటారు. వీటిలో కొన్నింటిని వైద్యుల పర్యవేక్షణలోనే చేయాలి. అలాగే మరికొన్ని తేలిక పద్ధతులను మనమే సొంతంగా చేసుకోవచ్చు. 'ఉపవాసం', 'పాచనం' అనే రెండు పద్ధతుల ద్వారా శరీరంలోని మలినాలను బయటికి పంపించొచ్చు. ఈ పద్ధతుల్లో భాగంగా మనం తీసుకునే ఆహారాన్నే 'డిటాక్స్ డైట్స్' అంటారు.

నిమ్మరసం, మజ్జిగ: వారంలో ఒక రోజు ఆహారంలో భాగంగా ఘనపదార్థాలను మానేసి, కేవలం ద్రవపదార్థాలను మాత్రమే తీసుకోవాలి. ఇలా చేస్తే, శరీరంలోని టాక్సిన్లు బయటకు పోతాయి. ఇందుకు నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, తాజా పండ్ల రసాలు తాగాలి. అలాగే పండ్లు మాత్రమే తినడం వల్ల కూడా శరీరంలో మలినాలు వెలుపలికి పోతాయి.

*ఉపవాసం చేయలేని వారు వారానికి ఒక రోజు కేవలం జావ తీసుకున్నా కూడా శరీరంలో పేరుకున్న వ్యాధి కారకాలను తగ్గించు



కోవచ్చు. ఇందుకోసం అర కప్పు బియ్యం, కప్పు పెసరపప్పును విడివిడిగా వేయించి, రెండింటినీ కలిపి కొంచెం బరకగా రవ్వలా మిక్సీ పట్టి భద్రపరుచుకోవాలి. కప్పు రవ్వకి నాలుగు కప్పుల నీరు తీసుకోవాలి. ముందుగా నీళ్లను పొయ్యిమీద పెట్టాలి. అవి మరుగుతున్నప్పుడు రవ్వ వేయాలి. అది ఉడికి, జావలా తయారయ్యాక ఆవాలు, జీలకర్ర, కరివేపాకు వేసిన తాలింపు, చెంచా నెయ్యి వేసుకుని వేడిగా ఉన్నప్పుడే తీసుకోవాలి. ఇలా రోజులో రెండు లేదా మూడు సార్లు ఈ జావని తీసుకుంటే చాలు. ఇలా వారానికి ఒకసారైనా ఘనపదార్థాలు తగ్గించడం మంచిది.

జీర్ణశక్తిని పెంచుకుంటే...ఆహారం జీర్ణమయ్యే ప్రక్రియనే 'పాచనం' అంటారు. మనం తీసుకునే ఆహారం సంపూర్ణంగా జీర్ణమైతే శరీరంలో వ్యాధికారకాలు పేరుకోవు. అందుకే తేలికగా జీర్ణమయ్యే పదార్థాలనే ఎంచుకోవాలి. అలాగే పొట్ట నిండేవరకు తినకూడదు. ఒకసారి తీసుకున్న ఆహారం పూర్తిగా జీర్ణమయ్యేవరకు మళ్లీ ఏదీ తినకూడదు. రాత్రిపూట ఎనిమిది గంటల్లోపే ఆహారాన్ని తీసుకోవాలి. ఈ నియమాలను పాటిస్తే మలినాలు పేరుకొనే సమస్య ఉండదు.కొన్ని పదార్థాలు జీర్ణశక్తిని పెంచుతూనే, మలినాలను కూడా తగ్గిస్తాయి. అదెలాగంటే...

* ఆహారం తినే ముందు అరచెంచా అల్లం ముక్కలు, చిటికెడు సైంధవ లవణం కలిపి తినాలి. తేలిగ్గా జీర్ణమవుతుంది.
* శొంఠిని నేతిలో వేయించి పొడి చేసి భద్రపరుచుకోవాలి. అన్నంలో మొదటి ముద్దను శొంఠి, నెయ్యి కలిపి తీసుకోవాలి.
* లీటరు నీళ్లను కాచి, వేడిగా ఉన్నప్పుడే ఫ్లాస్కులో పోయాలి. అందులో కొద్దిగా అల్లం ముక్కలు, పావు చెంచా చొప్పున జీలకర్ర, సోంపు, కొద్దిగా మిరియాల పొడి, ఎనిమిది పుదీనా ఆకులు వేసి మూత పెట్టేయాలి. రోజు మొత్తంలో ఈ నీటిని కొద్దికొద్దిగా తాగుతుంటే మలినాలు తొలగిపోతాయి. ఇటువంటి తేలికపాటి చిట్కాలు పాటిస్తే, వ్యాధులబారిన పడకుండా ఉండొచ్చు.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com
అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం



# రెండో వన్డేకు సిద్ధమైన భారత్

**అడిలైడ్ వేదికగా ఆసీస్‌తో రెండో వన్డే**

**టీమ్‌ఇండియాజట్టులో కీలక మార్పులు**

**వాషింగ్టన్ సుందర్‌పై వేటుపడే అవకాశం**

**కుల్దీప్‌ను జట్టులోకి తీసుకునే అవకాశాలు**

ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో తొలి వన్డేలో ఓటమి పాలైన భారత్ కీలకమైన రెండో వన్డేకు సిద్ధమైంది. నేడు అడిలైడ్ వేదికగా ఇరుజట్లు మధ్య రెండో వన్డే జరగనుంది. తొలి మ్యాచ్‌లో అన్ని విభాగాల్లో విఫలమైన భారత్ ఈ మ్యాచ్‌లో గెలుపే లక్ష్యంగా నెట్స్‌లో చెమటోడుస్తుంది. సిరీస్‌లో నిలవాంటే భారత్‌కు ఈ మ్యాచ్‌లో విజయం తప్పనిసరి. ఈ నేపథ్యంలో మ్యాచ్‌పై మరింత ఆసక్తి నెలకొంది. ఈ మ్యాచ్ కు ఆతిథ్యం ఇస్తున్న ఓవల్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం కావడంతో భారీ స్కోర్లు నమోదు అయ్యే ఛాన్స్ ఉంది. టాస్ గెలిచిన జట్టు ముందుగా బ్యాటింగ్ ఎంచుకునే చేసే అవకాశం ఉంది. మ్యాచ్ సాగే కొద్దీ పిచ్ స్పిన్నర్లకు అనుకూలంగా మారనుంది. తొలి వన్డేకు అంతరాయం కలిగించిన వర్షం రెండో వన్డేలోనూ ప్రభావం చూపే సూచనలు కనిపిస్తున్నాయి. అడిలైడ్‌లో ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో మ్యాచ్‌పై అభిమానుల్లో ఆందోళన నెలకొంది. మ్యాచ్ రోజు వర్షం ముప్పు తక్కువగానే ఉంటుందని వాతావరణ శాఖ చెబుతోంది.ఒత్తిడిలో బరిలోకి దిగుతున్న టీమ్‌ఇండియా తుది జట్టులో పలు మార్పులు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఫామ్‌లో ఉన్న కుల్దీప్ యాదవ్ తుది జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో వాషింగ్టన్ సుందర్‌పై వేటు పడనుంది. అయితే నితీశ్ కుమార్ రెడ్డిని తప్పించి కుల్దీప్‌ను జట్టులోకి తీసుకునే అవకాశాలు కూడా ఉన్నాయి. కానీ, నితీశ్ బ్యాటింగ్‌లో ప్రభావం చూపే ఛాన్స్ ఉండడం అతడికి కలిసొచ్చే అంశం. ఇక తొలి వన్డేలో విఫలమైన హర్షిత్ రాణా స్థానంలో ప్రసిద్ధ్‌కృష్ణకు జట్టులో స్థానం కల్పించవచ్చు.టీమ్‌ఇండియా స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ తొలి మ్యాచ్‌లో తీవ్రంగా నిరాశపర్చారు. రోహిత్ 8 పరుగులు బాదితే, విరాట్ అసలు పరుగుల ఖాతానే తెరవకుండానే పెవిలియన్ చేరాడు. దీంతో ఈ మ్యాచ్‌లోనైనా సీనియర్లు రాణించాలని అభిమానులు కోరుకుంటున్నారు. కెప్టెన్‌గా, బ్యాటర్‌గా శుభ్‌మన్ గిల్ కూడా రాణించాల్సి ఉంది. శ్రేయాస్ అయ్యర్ గాడిన పడాల్సి ఉండగా కేఎల్ రాహుల్, అక్షర్ పటేల్ ఫామ్ కొనసాగించాలి. పేసర్లు మహమ్మద్ సిరాజ్, అర్షదీప్ సింగ్‌లు రాణించాల్సిన అవసరం ఉంది. వర్షం అంతరాయం కలిగించిన తొలి వన్డేలో ఆసీస్ విజయం సాధించి సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది. దాంతో అడిలైడ్ వన్డే టీమిండియాకు చావో రేవోగా మారింది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే సిరీస్‌లో నిలవనుంది. లేదంటే సిరీస్ ఆసీస్ కైవసం కానుంది. దాంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. పెర్త్ వేదికగా జరిగిన తొలి వన్డేలో టీమిండియా ఇద్దరు స్పిన్ ఆల్‌రౌండర్లు, ముగ్గురు పేసర్లతో బరిలోకి దిగింది. స్పెషలిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను బెంచ్‌కే పరిమితం చేసింది. బ్యాటింగ్ డెప్త్ కోసం టీమిండియా మేనేజ్‌మెంట్ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే కుల్దీప్ యాదవ్‌ను పక్కనపెట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. 8 మంది బ్యాటర్లు ఎందుకు అంటూ మాజీ క్రికెటర్లు మండిపడ్డారు. బ్యాటింగ్‌కు ప్రాధాన్యత ఇస్తే బౌలింగ్ బలహీనంగా మారుతుందని విమర్శించారు. ఈ క్రమంలోనే అడిలైడ్ వన్డేలో టీమిండియా కుల్దీప్ యాదవ్‌ను ఆడించే ఛాన్స్ ఉంది. అంతేకాకుండా అడిలైడ్ పిచ్ స్పిన్నర్లకు అనుకూలంగా ఉంటుంది. బంతి పాతబడిన తర్వాత స్పిన్నర్లకు అనుకూలిస్తోంది. ఈ క్రమంలోనే టీమిండియా ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశం కూడా ఉంది. తొలి వన్డేలో విఫలమైన హర్షిత్ రాణాపై వేటు వేసి కుల్దీప్ యాదవ్‌ను ఆడించవచ్చు. తద్వారా బ్యాటింగ్ డెప్త్‌తో పాటు బౌలింగ్ విభాగం కూడా పటిష్టం కానుంది. ఎక్స్‌ట్రా పేసర్‌గా నితీష్ కుమార్ రెడ్డి బాధ్యతలు పంచుకోనున్నాడు. ముగ్గురు పేసర్లతో ఆడాలని నిర్ణయిస్తే మాత్రం వాషింగ్టన్ సుందర్‌పై వేటు పడుతుంది. గంభీర్ ఏ నిర్ణయం తీసుకుంటాడో చూడాలి. ఈ ఒక్క మార్పు మినహా తుది జట్టులో పెద్దగా మార్పులు జరిగే ఛాన్స్ లేదు.తొలి వన్డేలో అక్షర్ పటేల్ అటు బ్యాటర్‌గా ఇటు బౌలర్‌గా సత్తా చాటాడు. కుల్దీప్ యాదవ్ బరిలోకి దిగితే 9వ స్థానంలో ఆడుతాడు. స్పెషలిస్ట్ పేసర్లుగా మహమ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్ ఆడనున్నారు. తొలి వన్డేలో పర్వాలేదనిపించిన బౌలర్లు రెండో వన్డేలో సత్తా చాటాల్సిన అవసరం ఉంది. యశస్వి జైస్వాల్, ప్రసిధ్ కృష్ణతో పాటు ధ్రువ్ జురెల్‌కు మరోసారి నిరాశే ఎదురవ్వనుంది.

మరోవైపు, ప్రత్యర్థి ఆస్ట్రేలియా తుది జట్టులోనూ మార్పులు ఉండే అవకాశం ఉంది. తొలి వన్డేకు దూరమైన స్పిన్నర్ ఆడమ్ జంపా, అలెక్స్ కేరీ తిరిగి జట్టుతో కలిశారు. వీరిద్దరూ తుది జట్టులో ఆడడం ఖాయంగా కనిపిస్తోంది. దీంతో మాథ్యూ షార్ట్, మిచెల్ ఓవెన్ బెంచ్‌కు పరిమితం కానున్నారు. కెప్టెన్ మిచెల్ మార్ష్ అదిరే ఫామ్‌లో ఉండడం ఆ జట్టుకు అతిపెద్ద బలం. ట్రావిస్ హెడ్ ఫామ్‌లోకి వస్తే ఆసీస్‌కు తిరుగుండదు. అటు జోష్ హేజిల్‌వుడ్, మిచెల్ స్టార్క్, నాథన్ ఎలిస్‌తో కూడిన బౌలింగ్ విభాగం మరోసారి భారత్ బ్యాటర్లకు సవాల్ విసరనుంది. మ్యాచ్ ఉదయం 9 గంటలకు ప్రారంభం కానుంది. అయితే ఈ అడిలైడ్ వన్డేకు కూడా భారీ అడ్డంకి ఏర్పడనుంది. ఈ మ్యాచ్‌కు కూడా వర్షం అంతరాయం కలిగించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అడిలైడ్‌లో వర్షాలు పడుతున్నాయి. మంగళవారం భారీ వర్షం కురిసింది. బుధవారం కూడా వరణుడు ప్రభావం చూపించే అవకాశం ఉంది. మ్యాచ్ రోజుకు వర్షం ముప్పు తక్కువగానే ఉన్నప్పటికీ.. ఈ లోపు తడిగా ఉన్న మైదానాన్ని ఆరబెట్టడం కష్టంగా మారనుంది.ముఖ్యంగా పిచ్‌పై తడి లేకుండా చేసేందుకు మైదాన సిబ్బంది తీవ్రంగా కష్టపడుతున్నారు. ఇందుకోసం యూవీ లైట్లను ఉపయోగిస్తున్నారు. అవి ఎక్కువ వేడిని ప్రసరింపజేసి పిచ్ త్వరగా ఆరేందుకు తోడ్పడనున్నాయి. వర్షం లేని సమయంలో ఈ లైట్లను వాడి పిచ్‌ను ఆరబెడుతున్నారు. పెర్త్ వన్డే తరహాలో భారీ వర్షం రాకున్నా.. స్వల్ప చిరజల్లులతో ఆటకు అంతరాయం కలిగించే ఛాన్స్ ఉన్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. రోజంతా మైదానాన్ని మబ్బులు కమ్మేసే అవకాశాలు ఉన్నాయి. అడిలైడ్ పిచ్ ఆస్ట్రేలియాలోనే బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే వికెట్. పిచ్ చాలా ఫ్లాట్‌గా ఉంటుంది. బౌన్స్ లభిస్తోంది. బ్యాటర్లకు స్వర్గదామంగా ఉంటుంది. ఆస్ట్రేలియాలోనే స్పిన్నర్లకు అనుకూలంగా ఉండే వికెట్ కూడా ఇదే. బంతి పాతబడిన తర్వాత స్పిన్నర్లకు పట్టు చిక్కుతుంది. భారత్ తమ అత్యుత్తమ స్పిన్నర్లతో బరిలోకి దిగే ఛాన్స్ ఉంది.

**వన్డే సిరీస్ జట్లు:**

**టీమ్ఇండియా:** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, మహ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, ధ్రువ్ జురెల్.

**ఆస్ట్రేలియా:** మిచెల్ మార్ష్ (కెప్టెన్), జేవియర్ బార్ట్‌లెట్, అలెక్స్ కారీ, కూపర్ కొన్నోలీ, బెన్ ద్వార్షుయిస్, నాథన్ ఎల్లిస్, కామెరాన్ గ్రీన్, జోష్ హాజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మిచెల్ ఓవెన్, మాథ్యూ రెన్షా, మాథ్యూ షార్ట్, మిచెల్ స్టార్క్, ఆడమ్ జంపా.

# నేడు న్యూజిలాండ్‌తో టీమిండియా కీలక పోరు

**అమీతుమీ తేల్చుకోనున్న భారత మహిళల జట్టు**

**ఎక్స్‌ట్రా బ్యాటర్‌తో బరిలోకి దిగే ఛాన్స్**

**రేణుక సింగ్ పై వేటు వేసే అవకాశం!!**

మహిళల వన్డే ప్రపంచకప్ 2025 టోర్నీలో టీమిండియా కీలక పోరుకు సిద్ధమైంది. గురువారం న్యూజిలాండ్‌తో జరిగే లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత మహిళల జట్టు అమీతుమీ తేల్చుకోనుంది. వరుసగా మూడు పరాజయాలతో చతికిలపడిన భారత మహిళల జట్టు.. న్యూజిలాండ్‌ను ఓడించి మళ్లీ విజయాల బాట



పట్టాలనుకుంటుంది. ఈ మ్యాచ్ గెలిస్తేనే హర్మన్‌సేన సెమీస్ అవకాశాలు సజీవంగా ఉండనున్నాయి.ఓడితే సెమీస్ సమీకరణాలు మరింత సంక్లిష్టంగా మారుతాయి. ఇప్పటికే టాప్-3లో నిలిచి ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, ఇంగ్లండ్ సెమీస్ బెర్తులు ఖరారు చేసుకోగా.. నాలుగో స్థానం కోసం భారత్, న్యూజిలాండ్ పోటీ పడుతున్నాయి. ఈ క్రమంలోనే ఈ మ్యాచ్‌పై



సర్వత్రా ఆసక్తి నెలకొంది.గత మూడు మ్యాచ్‌ల్లో టీమిండియా విజయం ముంగిట బొక్కాబోర్లా పడింది. ముఖ్యంగా ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌ను ఒత్తిడి తట్టుకోలేక చేజేతులా చేజార్చుకుంది. చావో రేవో మ్యాచ్‌లో ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో టీమిండియా ఉంది. టీమ్ కాంబినేషన్‌లో స్వల్ప మార్పులు చేసే అవకాశం ఉంది. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో ఎక్స్‌ట్రా బౌలర్‌ను తీసుకున్న టీమిండియా.. బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్‌పై వేటు వేసింది. ఆమె స్థానంలో రేణుకా సింగ్‌ను తీసుకుంది. ఆరంభంలో భారత బౌలర్లు విఫలమైనా.. చివర్లో చెలరేగి ఇంగ్లండ్‌ను కట్టడి చేశారు.ఈ క్రమంలోనే న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో టీమిండియా ఇదే కాంబినేషన్‌ను కొనసాగిస్తుందా లేక ఎక్స్‌ట్రా బ్యాటర్‌గా జెమీమాను ఆడిస్తుందా అనేది చూడాలి. జెమీమాను ఆడించే అవకాశాలే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మ్యాచ్ జరిగే నవీ ముంబై పిచ్.. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండనుంది. ద్యూ ప్రభావం చూపనుంది. ఈ క్రమంలోనే టీమిండియా ఎక్స్‌ట్రా బ్యాటర్‌తో బరిలోకి దిగే ఛాన్స్ ఉంది. అయితే ఈ మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. మిగతా కాంబినేషన్‌లో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు.ఓపెనర్ స్మృతి మంధాన సూపర్ ఫామ్‌లో ఉండగా.. ప్రతికా రావల్ మెరుపులు మెరిపించాల్సి ఉంది. హర్లీన్ డియోల్ కూడా చెలరేగితే భారత్‌కు తిరుగుండదు. హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా ఫామ్‌లోకి వచ్చింది. రిచా ఘోష్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అమన్‌జోత్ కౌర్, దీప్తి శర్మ కూడా మెరుగ్గానే రాణిస్తున్నారు. ఛేజింగ్‌లో సెటిల్ అయిన బ్యాటర్ మ్యాచ్ ముగిసే వరకు క్రీజులో ఉండాల్సిన అవసరం ఉంది. ఈ విషయంపై టీమిండియా వర్క్ చేయాల్సి ఉంది. బౌలర్లుగా క్రాంతి గౌడ్, శ్రీచరణి, దీప్తి శర్మ, స్నేహ్ రాణా పర్వాలేదనిపిస్తున్నారు. సమష్టి ప్రదర్శన కనబరిస్తేనే టీమిండియాకు విజయం దక్కనుంది. మధ్యాహ్నం 3 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుండగా.. జియో హాట్‌స్టార్, స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుంది.

**భారత తుది జట్టు(అంచనా):**

స్మృతి మంధాన, ప్రతికా రావల్, హర్లీన్ డియోల్, హర్మన్‌ప్రీత్ కౌర్, రిచా ఘోష్, అమన్‌జోత్ కౌర్, స్నేహ్ రాణా, దీప్తి శర్మ, రేణుక సింగ్/జెమీమా రోడ్రిగ్స్, క్రాంతి గౌడ్, శ్రీ చరణి.

# నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం



భారతదేశ స్టార్ ఒలింపిక్ అథ్లెట్ నీరజ్ చోప్రాకు బుధవారం భారత సైన్యంలో లెఫ్టినెంట్ కల్నల్ పదవి లభించింది. క్రీడల్లో ఆయన సాధించిన గొప్ప విజయాలు, యువతను ప్రేరేపించినందుకు నీరజ్‌కు ఈ గౌరవం దక్కింది. ఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సైనిక దళాల అధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది సమక్షంలో ఆయనకు ఈ పదవిని అందజేశారు. నీరజ్ చోప్రా నాయిబ్ సుబేదార్ హోదాలో 2016లో భారత సైన్యంలో చేరారు. 2021లో ఆయనకు పదోన్నతి లభించి సుబేదార్ పదవిని పొందారు. ది గెజెట్ ఆఫ్ ఇండియా ప్రకారం.. ఈ నియామకం ఏప్రిల్ 16 నుండి అమలులోకి వచ్చింది. 2016లో ఆయన భారత సైన్యంలో చేరారు. అథ్లెటిక్స్‌లో నిరంతర మంచి ప్రదర్శన కారణంగా 2018లో అర్జున అవార్డుతో సత్కారం పొందారు.. ఆ తర్వాత మూడేళ్లకు ఆయన టోక్యో ఒలింపిక్స్‌లో పురుషుల జావెలిన్ త్రోలో బంగారు పతకం సాధించి చరిత్ర సృష్టించారు. ఈ ఒక్క విజయంతో ఆయన భారతదేశంలోని లక్షలాది మంది యువతకు స్ఫూర్తినిచ్చారు. 2021లో ఆయనకు ఖేల్ రత్న అవార్డు లభించింది. నీరజ్ చోప్రా భారత అథ్లెటిక్స్‌కు చేసిన కృషి అసమానమైనది. 2022లో ఆయనకు పరమ విశిష్ట సేవా పతకం లభించింది, ఇది భారత సైన్యం ద్వారా అందించబడే అత్యున్నత గౌరవం. ఈ అన్ని విజయాల మధ్య నీరజ్ చోప్రా కారణంగా భారత దేశంలో అథ్లెటిక్స్ మరియు జావెలిన్ త్రో ఒక కొత్త క్రీడా తరంగాన్ని సృష్టించాయి. ఆయన విజయం అనేక మంది యువతకు ఈ క్రీడను ఎంచుకోవడానికి ప్రేరణగా నిలిచింది. జావెలిన్ త్రోలో నిరంతరం లభిస్తున్న విజయాల ఆధారంగా ఆయనకు 2022లో సుబేదార్ మేజర్ పదవికి పదోన్నతి లభించింది. అదే సంవత్సరంలో ఆయనకు భారత దేశ నాల్గవ అత్యున్నత పౌర పురస్కారం అయిన పద్మశ్రీ అవార్డుతో సత్కరించబడ్డారు. నీరజ్ చోప్రా చివరిసారిగా ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పోటీపడ్డారు, అక్కడ ఆయన ఎనిమిదవ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయినప్పటికీ ఆయన ప్రదర్శన ఎప్పుడూ దేశానికి గర్వకారణంగా నిలుస్తుంది.

# చరిత్ర సృష్టించిన వెస్టిండీస్

ఒకప్పుడు ఫాస్ట్ బౌలింగ్‌కు మారుపేరుగా నిలిచిన వెస్టిండీస్ క్రికెట్ జట్టు వన్డే క్రికెట్ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా స్పిన్ బౌలింగ్‌తో చరిత్ర సృష్టించింది. బంగ్లాదేశ్‌లోని ఢాకా వేదికగా జరిగిన రెండో వన్డే మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు తమ ఇన్నింగ్స్ లోని మొత్తం 50 ఓవర్లను కేవలం స్పిన్ బౌలర్ల చేత మాత్రమే వేయించి ప్రపంచ రికార్డును నెలకొల్పింది. పూర్తి స్థాయి సభ్యదేశం ఈ అద్భుతమైన ఫీట్‌ను సాధించడం ఇదే మొదటిసారి. తొలి వన్డేలో బంగ్లాదేశ్ స్పిన్నర్ రిషాద్ హుస్సేన్(6 వికెట్లు) దెబ్బకు వెస్టిండీస్ స్వల్ప స్కోరుకే కుప్పకూలిన నేపథ్యంలో వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్, టీమ్ యాజమాన్యం వ్యూహాత్మకంగా ఆలోచించారు. రెండో వన్డేకు ఉపయోగించిన ఢాకా పిచ్ పూర్తిగా పొడిగా, పగుళ్లతో స్పిన్‌కు అత్యంత అనుకూలంగా ఉండటంతో పేస్ బౌలర్లను పక్కనపెట్టి ఆల్-స్పిన్ దాడికి దిగాలని నిర్ణయించుకున్నారు. ఇది కరేబియన్ క్రికెట్ సంప్రదాయానికి పూర్తి విరుద్ధమైన నిర్ణయమైనా.. పిచ్ కండిషన్స్‌కు తగ్గట్టుగా తీసుకున్న సరైన నిర్ణయంగా నిరూపించబడింది.వెస్టిండీస్ జట్టు ఐదుగురు స్పిన్ బౌలర్లను (అకీల్ హొసేన్, రోస్టన్ ఛేజ్, ఖారీ పియెర్రీ, గుడకేశ్ మోటీ, అలిక్ అథనాజ్) ఉపయోగించింది. వీరిలో ప్రతి ఒక్కరూ తమ కోటా 10 ఓవర్లను పూర్తి చేశారు. ఈ సమష్టి దాడి బంగ్లాదేశ్ బ్యాటర్లనున తీవ్రంగా ఇబ్బంది పెట్టింది.గుడకేశ్ మోటీ (3/65) ప్రధాన స్పిన్నర్‌గా మోటీ 3 కీలక వికెట్లు పడగొట్టి తన పాత్రను సమర్థంగా పోషించాడు. పార్ట్‌టైమ్ స్పిన్నర్‌గా జట్టులోకి వచ్చిన అలిక్ అథనాజ్ (2/14) అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. తన 10 ఓవర్లలో కేవలం 14 పరుగులను మాత్రమే ఇచ్చి 2 కీలక వికెట్లు పడగొట్టడం విశేషం.పవర్ ప్లేతో సహా కీలక సమయాల్లో అకీల్ హొసేన్ (2/41) రెండు వికెట్లు తీసి జట్టుకు బ్రేక్‌త్రూలు అందించాడు. ఈ ఐదుగురు స్పిన్నర్ల ధాటికి బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 213 పరుగులు మాత్రమే చేయగలిగింది. చివర్లో రిషాద్ హొస్సేన్ 14 బంతుల్లో 39 పరుగుల మెరుపు ఇన్నింగ్స్‌తో బంగ్లా గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. 214 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన వెస్టిండీస్ జట్టు కూడా చివరి బంతికి 213 పరుగులకే పరిమితం కావడంతో మ్యాచ్ టై అయ్యింది. కెప్టెన్ షాయ్ హోప్ (53 నాటౌట్)




అద్భుతంగా రాణించినప్పటికీ, బంగ్లా స్పిన్నర్ల ధాటికి విండీస్ తడబడింది. దీంతో విజేతను నిర్ణయించడానికి సూపర్ ఓవర్ అనివార్యమైంది. సూపర్ ఓవర్‌లో వెస్టిండీస్ బౌలర్ అకీల్ హుసేన్ మరోసారి తన స్పిన్‌తో మాయ చేసి బంగ్లాదేశ్‌ను ఒక్క పరుగు తేడాతో ఓడించాడు. ఈ విజయంతో వెస్టిండీస్ సిరీస్‌ను 1-1తో సమం చేసి కీలకమైన విజయాన్ని నమోదు చేసింది.50 ఓవర్ల స్పిన్ బౌలింగ్: వన్డే చరిత్రలో 50 ఓవర్లు స్పిన్నర్లతో బౌలింగ్ వేసిన తొలి జట్టుగా వెస్టిండీస్ నిలిచింది. అంతకుముందు శ్రీలంక 1996లో వెస్టిండీస్‌పై మూడు సార్లు 44 ఓవర్లు స్పిన్ బౌలింగ్ వేసిన రికార్డును బద్దలు కొట్టింది. అత్యధిక స్పిన్ ఓవర్లు: ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ 50 ఓవర్లు, బంగ్లాదేశ్ 42 ఓవర్లు (ముస్తాఫిజుర్ రెహమాన్ ఒక్కడే పేసర్) స్పిన్ బౌలింగ్ వేయడంతో, ఇరు జట్లు కలిపి మొత్తం 92 ఓవర్లు స్పిన్ బౌలింగ్ చేసిన అరుదైన ప్రపంచ రికార్డును కూడా ఈ మ్యాచ్ నెలకొల్పింది. అంతకుముందు 78.2 ఓవర్ల రికార్డు ఉండేది.



## ఆర్‌టీ76తో వస్తున్న మాస్‌మహారాజ్ రవితేజ

అభిమానులకు కావాల్సిన ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ అందించేందుకు రవితేజ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ఫుల్ బిజీగా మారిపోయాడు. ఇప్పటికే భాను భోగవరపు దర్శకత్వంలో నటిస్తోన్న మాస్ జాతర సినిమా అక్టోబర్ 31న విడుదలకు రెడీ అవుతోంది. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ నేపథ్యంలో మూవీ ప్రమోషన్స్ కూడా కొనసాగుతున్నాయి. కాగా ఈ సినిమా రిలీజ్ కాకముందే రవితేజ కొత్త సినిమా వార్త నెట్టింట వైరల్ అవుతోంది. కిశోర్ తిరుమల దర్శకత్వంలో రవితేజ నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ ఆర్‌టీ76. ఈ చిత్రంలో అమిగోస్ ఫేం ఆషికా రంగనాథ్ ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కాగా ఈ మూవీ అప్‌డేట్ షేర్ చేసి మూవీ లవర్స్, అభిమానుల్లో జోష్ నింపుతోంది ఆషికా రంగనాథ్. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ స్పెయిన్‌లో కొనసాగుతోంది. స్పెయిన్‌లో సాంగ్ షూట్ పూర్తయిన సంబంధించిన విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. ఈ షూట్‌తో స్పెయిన్ షెడ్యూల్ కూడా పూర్తయినట్టు తెలిపింది. రవితేజ్ అండ్ టీం త్వరలోనే ఇండియాకు తిరిగిరానుంది. ఇంకా టైటిల్ ఫిక్స్ కాని ఈ ప్రాజెక్టు 2026 సంక్రాంతి కానుకగా విడుదల కానుంది. ఇండియాకు తిరిగిరాగానే మాస్ జాతర ప్రమోషన్స్‌తో బిజీ కానున్నాడు రవితేజ. ఈ చిత్రలో రవితేజ రైల్వే పోలీసాఫీసర్‌గా సందడి చేయబోతున్నాడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సంయుక్తంగా తెరకెక్కుతున్ నీ చిత్రంలో రాజేంద్రప్రసాద్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నాడు.

## స్పీడ్ పెంచిన శ్రీనిధి శెట్టి



టాలీవుడ్‌లో మరో క్రేజీ కాంబినేషన్ ఫిక్స్ అయ్యింది. విక్టరీ వెంకటేశ్, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ చిత్రం రూపుదిద్దుకుంటున్న విషయం తెలిసిందే. హారిక అండ్ హాసిని చిత్ర నిర్మాణ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. అయితే ఈ సినిమాలో కథానాయిక విషయంలో శ్రీనిధి శెట్టి, రాశీ ఖన్నా అంటూ పలువురి పేర్లు తెర మీదకు వచ్చినా చివరకు కన్నడ నటి శ్రీనిధి శెట్టిని ఫైనల్ చేశారు. తాజాగా మంగళవారం శ్రీనిధి జన్మదినాన్ని పురస్కరించుకుని మేకర్స్ శుభాకాంక్షలు తెలుపుతూ అధికారికంగా ప్రకటించారు. ఇప్పటికే ఈ ఏడాది హిట్3 చిత్రంతో మంచి విజయం రుచి చూసిన శ్రీనిధి దీపావళికి తెలుసు కదా అనే సెన్సిబుల్ సినిమాతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇది ఇలా ఉండగానే విక్టరీ వెంకటేశ్, త్రివిక్రమ్ వంటి అగ్ర స్థాయి టీమ్‌తో పని చేసే ఛాన్స్ దక్కడంతో ఆమె ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఇప్పుడు ఈ చిత్రమే కాకుండా తమిళంతో అజిత్‌తో ఒకటి తెలుగులో మరో రెండు సినిమాలు సైతం అమ్మడి చేతిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలాఉంటే.. ఇప్పటికే వెంకటేశ్ సూపర్ హిట్ చిత్రాలు 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' చిత్రాలకు త్రివిక్రమ్ రచన చేశారు. దీంతో ఇప్పుడు వీరిద్దరి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం ప్రేక్షకుల్లో విపరీతమైన అంచనాలు ఏర్పడ్డాయి. అదేవిధంగా తమన్ కాకుండా యానిమల్ ఫేం హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండడం విశేషం. కాగా ఈ మూవీ 2026 వేసవిలో ప్రేక్షకుల ఎదుటకు వచ్చే అవకాశం ఉంది.



## రమ్యకృష్ణకు అంతమంది లైన్ వేశారా?


తెలుగు, తమిళ ఇండస్ట్రీల్లో స్ట్రాంగ్ ఉమెన్ క్యారెక్టర్స్‌తో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన హీరోయిన్ రమ్యకృష్ణ . ఇటీవల జీ తెలుగు షో జయమ్ము నిశ్చయమ్మురాలో సందడి చేసింది. గ్లామర్ హీరోయిన్‌గా కెరీర్ ప్రారంభించిన రమ్యకృష్ణ, రాఘవేంద్రరావు దర్శకత్వంలో వరుసగా సినిమాలు చేసి స్టార్ స్టేటస్ దక్కించుకుంది. ఇక బాహుబలిలో శివగామి పాత్ర ద్వారా కెరీర్‌లో మరో మెట్టు ఎక్కిన విషయం తెలిసిందే. తాజాగా జగపతి బాబు షోకి హాజరైన రమ్యకృష్ణ ఆసక్తికర కామెంట్స్ చేసింది. అయితే రమ్యకృష్ణ ఎంట్రీతో షో హోస్ట్ జగపతిబాబు కుర్రాడిలా మారి, స్టైలిష్‌గా ప్రవర్తించడం, టీషర్ట్‌లో యంగ్ లుక్‌లో కనిపించడం, స్టెప్పులేసి రమ్యకృష్ణని ఇంప్రెస్ చేసుకోవడానికి ప్రయత్నించడం హైలైట్‌గా నిలిచింది. రమ్యకృష్ణ, తన ఫన్నీ ఎక్స్‌ప్రెషన్స్‌తో జగపతిబాబును కవర్ చేయడం, కౌంటర్ ఇచ్చి షోను మరింత ఆసక్తికరంగా మార్చడం ప్రేక్షకులను అలరించింది.మొత్తంగా రమ్యకృష్ణ, జగపతిబాబు మధ్య ఫన్నీ కౌంటర్ డైలాగ్స్, ఎంటర్టైనింగ్ ఎక్స్‌ప్రెషన్స్‌లు షోను సక్సెస్‌ఫుల్‌గా మార్చనున్నాయి.'నీకు చిన్నప్పట్నుంచి చాలా మంది సైట్ కొట్టడం, ప్రేమించడం, పడి దొర్లడం.. అని జగపతిబాబు చెబుతుండగానే .. 'ఇన్‌క్లూడింగ్ యూ(నువ్వు కూడా) అంటూ జగ్గు బాయ్ ముఖం మీదే నవ్వుతూ చెప్పేసింది. దీనికి జగపతి బాబు కూడా స్మైలింగ్ ఎక్స్ ప్రెషన్స్ ఇచ్చారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ప్రోమోలు నెట్టింట వైరలవుతున్నాయి. కాగా, రమ్యకృష్ణ పాజిటివ్, నెగటివ్ పాత్రలలో ఆకట్టుకుంటూ ఉంటే, జగపతిబాబు కూడా క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా పవర్‌ఫుల్ రోల్స్‌తో ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఇలాంటి ఎంటర్‌టైనింగ్ కంటెంట్, బలమైన పాత్రల కలయిక, ప్రేక్షకుల మన్ననలు రమ్యకృష్ణ, జగపతిబాబులని టాప్ ఫేవరేట్స్‌గా నిలబెట్టింది. జగపతిబాబు, రమ్యకృష్ణ కలిసి పలు సినిమాల్లో నటించారు. ఆయనకు ఇద్దరు, బడ్జెట్ పద్మనాభం తదితర చిత్రాల్లో హీరో, హీరోయిన్లుగా నటించారు.



## రామ్‌చరణ్‌తో జోడిగా కృతి సనన్!

### చాన్స్ ఇచ్చిన సుకుమార్

ఇతర భాషల నుంచి చాలా మంది ముద్దుగుమ్మలు మన దగ్గరకు వచ్చి స్టార్స్ గా మారుతున్నారు. తెలుగు అమ్మాయిలకు మంచి అవకాశాలు వస్తున్నా కూడా ఇతర భాషల హీరోయిన్స్ మన దగ్గర స్టార్ డమ్ సొంతం చేసుకుంటున్నారు. కన్నడ నుంచి వచ్చిన రష్మిక మందన్న తెలుగు సినిమాలతోనే విపరీతమైన క్రేజ్ తెచ్చుకుంది. అలాగే హిందీ నుంచి వచ్చిన మృణాల్ మన దగ్గర టాప్ హీరోయిన్.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతో మంది పేర్లు లిస్ట్ లో ఉంటాయి. అయితే ఇతర భాషల నుంచి వచ్చిన అందరు హీరోయిన్స్ సక్సెస్ అవ్వరూ.. కొంతమంది మాత్రం బ్యాక్ టు బ్యాక్ డిజాస్టర్ అందుకుంటూ ఉంటారు. దాంతో తిరిగి తమ ఇండస్ట్రీకి చెక్కేస్తుంటారు. అలానే ఓ అమ్మడు తెలుగులో రెండు సినిమాలు చేసింది. రెండు పెద్దగా ప్రేక్షకులను మెప్పించలేదు.. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? తెలుగులో డిజాస్టర్ అందుకుంది.. బాలీవుడ్ లోనూ పెద్దగా హిట్స్ లేవు. ఆయినా కూడా ఇప్పుడు ఓ బడా హీరో పిలిచి మరి ఛాన్స్ ఇచ్చాడు ఆ అమ్మడికి.. ఇంతకూ ఆమె ఎవరో కాదు.. బాలీవుడ్



పొడుగుకాళ్ల సుందరి కృతి సనన్. బాలీవుడ్ బ్యూటీ కృతి సనన్ గురించి చెప్పక్కర్లేదు. ఇప్పుడు హిందీలో సెటిల్ అయిన భామ.. ముందుగా తెలుగులోనే నటించింది. మహేష్ బాబు, సుకుమార్ కాంబోలో వచ్చిన 1 నేనొక్కడినే చిత్రంతో నటిగా తెరంగేట్రం చేసింది. ఆ సినిమా పెద్దగా ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. ఆతర్వాత నాగచైతన్యతో కలిసి దోచేయ్ అనే సినిమా చేసింది. ఈ సినిమా డిజాస్టర్ అవ్వడంతో బాలీవుడ్ షిఫ్ట్ అయ్యి అక్కడే వరుస సినిమాల్లో నటిస్తుంది. మొన్నామధ్య ప్రభాస్ తో కలిసి ఆదిపురుష్ అనే సినిమా చేసింది. రామాయణం నేపథ్యంలో వచ్చిన ఈ సినిమా డబుల్ డిజాస్టర్ అయ్యింది. ఇక ఇప్పుడు ఈ అమ్మడికి సుకుమార్ ఛాన్స్ ఇచ్చారని తెలుస్తుంది. సుకుమార్, రామ్ చరణ్ కాంబినేషన్‌లో రాబోతున్న సినిమాలో కృతి సనన్ హీరోయిన్ గా నటిస్తుందని టాక్ వినిపిస్తుంది. గతంలో సుకుమార్ తెరకెక్కించిన వన్ నేనొక్కడినే సినిమాలో కృతి హీరోయిన్ గా చేసింది. ఇప్పుడు మరోసారి ఆమెకు సుక్కు ఛాన్స్ ఇచ్చాడని తెలుస్తుంది.



## బాలీవుడ్‌లో బిజీగా శ్రీలీల

పైకి ఖాళీగా ఉన్నట్లే కనిపిస్తుంది కానీ నిజానికి చాలా బిజీగా ఉన్నారు శ్రీలీల. అస్సలు ఖాళీ లేకుండా ఉన్నారీ భామ. ఓవైపు టాలీవుడ్.. మరోవైపు బాలీవుడ్.. ఇంకోవైపు కోలీవుడ్.. అన్ని ఉడ్లలో మోస్ట్ వాంటెడ్ అయిపోతున్నారు శ్రీలీల. ముఖ్యంగా ముంబై నుంచి అమ్మడికి అదిరిపోయే అవకాశాలు వస్తున్నాయి. ఆల్రెడీ కార్తిక్ ఆర్యన్ హీరోగా శ్రీలీల హిందీలో డెబ్యూ చేస్తున్నారు. ఈ చిత్ర షూటింగ్ వేగంగా జరుగుతుంది. 2026 ఫస్టాఫ్‌లో విడుదల కానుంది ఈ చిత్రం. ఇది సెట్స్‌పై ఉండగానే.. మరో రెండు మూడు ఆఫర్స్ శ్రీలీల ఖాతాలో చేరిపోయేలా ఉన్నాయి. మరోవైపు రణ్‌వీర్ సింగ్‌తో అట్లీ దర్శకత్వంలో ఓ యాడ్ చేసారు శ్రీలీల. దీన్ని ఏకంగా ఓ సినిమా రేంజ్‌లో తెరకెక్కించారు అట్లీ. తెలుగులోనూ ఫుల్ బిజీగా ఉన్నారు శ్రీలీల. ఇప్పటికే పవన్‌తో నటిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ షూట్ పూర్తి కాగా.. మాస్ జాతర అక్టోబర్ 31న విడుదల కానుంది. ఈ రెండింటి తర్వాత శ్రీలీల తెలుగులో గ్యాప్ తీసుకుంటున్నారు. మరోవైపు తమిళంలో పొంగల్‌కు పరాశక్తితో రాబోతున్నారు. మూడు ఇండస్ట్రీలను కవర్ చేస్తూ సూపర్ బిజీ అయిపోయారు ఈ బ్యూటీ. వరస సినిమాలైతే చేస్తున్నారు కానీ విజయాల విషయంలో మాత్రం కాస్త వెనకబడ్డారు శ్రీలీల. చివరగా గుంటూరు కారం పర్లేదనిపిస్తే.. భగవంత్ కేసరి హిట్ లిస్టులో చేరింది. ఆ తర్వాత పుష్ప 2లో కిస్ కిస్ కిసిక్ పాటతో దేశాన్ని ఊపేసారు ఈ బ్యూటీ. ఇప్పుడు మళ్లీ జోరు పెంచేస్తున్నారు. మరి ఇందులో ఆమె కోరుకున్న విజయం ఏ ఇండస్ట్రీ నుంచి వస్తుందో చూడాలి.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154